www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 74 | శనివారం | 24 అక్టోబర్, 2026



40శాతం ధర తగ్గిన మలేరియా టీకా

- 10లక్షల మంది చిన్నారులకు అదనపు రక్షణ
- భారత్ బయోటెక్

2



విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

వికసిత్ భారత్-2047 దిశగా అడుగులు వేయాలి

వ్యక్తిగత పురోగతి జాతీయ అభివృద్ధికి సాధనంగా మారాలి

చిన్మయ అమృత మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనంలో ప్రధాని మోడీ

సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, సామాజిక రుగ్మతలను ఎదుర్కొంటూనే దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. పౌరుల్లో ఆత్మనిర్భరతపై అవగాహన పెంపొందించి, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ ముందుకు నడిపించాలని సూచించారు. ఢిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న చిన్మయ అమృత మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక గొప్ప ఆలోచనా విధానమని ఆయన కొనియాడారు. భారతదేశం తన సంస్కృతికి జన్మస్థలమని, దేశ అస్తిత్వానికి పునాది అని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీ: సమాజంలో తలెత్తుతున్న కొత్త సవాళ్లు, సామాజిక రుగ్మతలను ఎదుర్కొంటూనే దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. పౌరుల్లో ఆత్మనిర్భరతపై అవగాహన పెంపొందించి, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ ముందుకు నడిపించాలని సూచించారు. ఢిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న చిన్మయ అమృత మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక గొప్ప ఆలోచనా విధానమని ఆయన కొనియాడారు. భారతదేశం తన సంస్కృతికి జన్మస్థలమని, దేశ అస్తిత్వానికి పునాది అని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాల్లో కాలం మారిందని, దేశం ముందు కొత్త సవాళ్లు, సమాజంలో కొత్త రుగ్మతలు ఉద్భవించాయని మోదీ పేర్కొన్నారు. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సమాజాన్ని విభజించే శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయాలని, స్వావలంబన దిశగా పౌరులను ప్రేరేపించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు.వ్యక్తిగత పురోగతి జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా మారాలని ప్రధాని ఆకాంక్షించారు. స్వామి చిన్మయానంద బోధనలు, ఆధ్యాత్మిక వికాసాన్ని దేశాభివృద్ధితో అనుసంధానించేందుకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చే వేద మంత్రాన్ని ఆయన ప్రస్తావించారు. 'వయం రాష్ట్రే జాగృయామ పురోహితాః' అనే వేద మంత్రం దేశ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేయాలని బోధిస్తుందని మోడీ వివరించారు. స్వామి చిన్మయానంద తన జీవితమంతా ఈ స్ఫూర్తితోనే జీవించారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ఎంతటి అంకితభావంతో మాట్లాడేవారో, జాతీయ సమస్యలపైనా అంతే ఉత్సాహంతో, స్పష్టతతో తన అభిప్రాయాలను వెల్లడించేవారని తెలిపారు. స్వామి చిన్మయానంద హోలోగ్రాఫిక్ ప్రతిరూపంతో సంభాషించే అవకాశం తనకు 33 ఏళ్ల కిందటి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసిందని ప్రధాని చెప్పారు. 1993లో వడోదరలో గురుదేవ్‌ను కలిసిన సందర్భం, ఆయనతో జరిగిన సంభాషణలు, చూపిన వాత్సల్యం, అందించిన ఆశీస్సులు తన కళ్లముందు కదలాడాయని వివరించారు. ఈ ప్రత్యేక అనుభవాన్ని సాధ్యం చేసిన చిన్మయ మిషన్ సభ్యులం దరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి సంభాషణల్లో యువశక్తిని బలోపేతం చేయడం ద్వారా శక్తిమంతమైన, సమర్థవంతమైన భారతదేశాన్ని నిర్మించడంపైనే ప్రధానంగా చర్చించామని మోదీ వెల్లడించారు. ఆ భేటీ జరిగిన కొన్ని సంవత్సరాలకే ప్రజలు తనకు గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం కల్పించారని గుర్తుచేసుకున్నారు.

దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే లక్ష్యం

భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద ప్రధాన లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించి, దాన్ని జాతీయ అభివృద్ధికి ఉపయోగపడే శక్తిగా మార్చుకోవాలని స్వామీజీ బోధించారని తెలిపారు. దేశమే మన ఉనికికి పునాది అనే భావనను ప్రతి ఒక్కరిలోనూ బలంగా నాటాలని ఆయన ఆకాంక్షించారని వివరించారు. ఈ లక్ష్యంతోనే స్వామి చిన్మయానంద 'గీతా జ్ఞాన యజ్ఞం'ను ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం సహా భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాల్లోని జ్ఞానాన్ని సామాన్య ప్రజలకు చేరువ చేశారని ప్రధాని చెప్పారు. ఆయన ప్రారంభించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఉద్యమం ఫలితాలను నేడు మనం చూస్తున్నామని పేర్కొన్నారు. భారతీయ విలువలను యువతరానికి చేరవేయడం లో చిన్మయ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని మోదీ ప్రశంసించారు. యువత భారతీయ సంస్కృతికి ప్రతినిధులుగా మారి, దేశ వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని తెలిపారు.



కోటిపైనే దరఖాస్తులు

- చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిన జియో ఐపీఓ
- రూ.7.4 లక్షల కోట్ల డిమాండ్.. 22.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్
- సంస్థాగత మదుపర్ల నుంచి భారీ స్పందన
- రూ.30,213 కోట్ల సమీకరణకు రిలయన్స్ అనుబంధ సంస్థ సన్నాహాలు

7



పర్యాటకానికి పండుగ కళ

- దేశీయ విడిది కేంద్రాలపై 40శాతం పెరిగిన శోధనలు

2

358 మండలాల్లో కరువు

- కట్టడికి సర్కార్ సమగ్ర కార్యాచరణ
- ఈ నెల 31లోగా కేంద్రానికి నివేదిక
- తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం
- రిజర్వాయర్లలో 470 టీఎంసీలకు బదులు 170 టీఎంసీలే లభ్యత
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన
- ప్రతి జిల్లాకు రూ.కోటి అత్యవసర నిధులు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఎల్‌నినోపై భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం లో నెలకొంటున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందు కు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందిస్తోంది. తాగు నీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధిపై క రువు ప్రభావం పడకుండా ముందస్తు చర్యలకు సిద్ధమ వుతోంది. ప్రాథమికంగా 358 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు గుర్తించామని, ఈ నెల 31లోగా కరువు మండలాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి స మర్పిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. కరువు పరిస్థితులపై సమీక్షించి ప్రభు త్వానికి సిఫార్సులు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగిం ది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివా సరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కరవు తీవ్రతను శాస్త్రీయంగా అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకా రం అర్హమైన మండలాలను గుర్తించాలని భట్టి విక్రమా ర్క అధికారులను ఆదేశించారు. ఇప్పటికే తీవ్ర కరువు ఉన్న ప్రాంతాలతో పాటు 20 శాతానికి మించి కరవు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను పరిశీలించి సిఫార్సులు సిద్ధం చేయాలని సూచించారు. తాగునీరు, సాగునీటికి ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, అత్యవసర ఖర్చులకు ఆర్థిక శాఖ సహకారం అందించాలని సూ చించారు. కరువు పరిస్థితులపై చర్చించేందుకు త్వరలో అఖిలపక్ష సమా వేశం నిర్వహించాలని నిర్ణయించారు.

ప్రత్యామ్నాయాలపై అవగాహన

కరువు ప్రభావంతో వ్యవసాయ రంగానికి నష్టం తగ్గిం చేందుకు నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సమావేశం నిర్ణయించిం ది. రైతులకు ముందుగానే సాగు సలహాలు అందించా లని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రతి జిల్లాలో తరువాయి 2లో..

తుమ్మిడిహెట్టి ఎత్తుపై పట్టు

152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి కసరత్తు

- త్వరలో మహారాష్ట్రతో చర్చలు.. సానుకూలంగా సీఎం ఫడ్నవీస్
- ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటి కేటాయింపులకు కోత పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏదులకు అదనంగా 0.6 టీఎంసీల లిఫ్టింగ్
- నీటి పారుదల ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం నన్నద్ధమవుతోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన, అటవీ, గిరిజన ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం తదితర వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు, డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటిని అందించే విషయంలో పాలమూరు ప్రాజెక్టు ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా మధ్యేమార్గాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



కరువు నివారణలో సర్కార్ విఫలం

- ఆర్నెళ్లుగా ఎల్‌నినో ప్రభావం తెలుసు.. ముందస్తు చర్యలేవీ?
- ప్రజలను భయపెట్టడం కాదు.. భరోసా కల్పించాలి
- ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజానావ,హైదరాబాద్: రాష్ట్రంలో కరవు పరిస్థితు లను ఎదుర్కోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శిం చారు. ఎల్‌నినో ప్రభావం గురించి ఆరు నెలలుగా తెలుసని చెబుతున్న ప్రభుత్వం.. కరువు నివారణకు తీసుకున్న ముందస్తు చర్యలేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, రైతులకు భరోసా క ల్పించాల్సిన రేవంత్.. తాగునీరు కూడా ఉండదం టూ భయాందోళనలు కలిగించడం సరికాదన్నారు. కరవు నివారణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం చేతులు కాలాక తరువాయి 2లో..

సైబర్ క్రిమినల్ల టార్గెట్‌లో భారత్

- వాళ్ల లక్ష్యాల్లో ప్రపంచంలో 7వ స్థానం, ఆసియాలో 3వ స్థానం
- ఎన్‌డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో మైక్రోసాఫ్ట్ నిపుణుడు నికోలస్ బట్స్



న్యూఢిల్లీ: సైబర్ దాడుల విషయంలో భారతదేశం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోందని, అది ఇప్పుడే పొంచి ఉందని మైక్రోసాఫ్ట్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ పాలసీ డైరెక్టర్ నికోలస్ బట్స్ హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా మారుతున్న దేశాల జాబితాలో భారత్ 7వ స్థానంలో ఉండగా, ఆసియా ఖండంలో 3వ స్థానంలో ఉందని ఆయన వెల్లడించారు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఎన్‌డీటీవీ వరల్డ్‌సమ్మిట్ 2026లో ఆయన మాట్లాడారు. ఈ ముప్పు ఇప్పుడే ఉన్నదని, తర్వాత ఎప్పుడో వస్తుందని ఎదురుచూసేది కాదని అన్నారు. ఇప్పుడే దీనికి అడ్డుకట్ట వేయకపోతే పెద్ద నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. చైనా, రష్యా నుంచి భారత్‌కు ప్రధానంగా 3 ఏఐ ఆధారిత తరువాయి 2లో..



కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం

కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత

- స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ధైర్యం ప్రభుత్వానికి లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రజానావ, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్ర జల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట బీఆర్ఎస్ కార్యకర్తలతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ సత్తా చాటుతుందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల నమో దు నుంచి పోలింగ్ వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ధనబలాన్ని మాత్రమే నమ్ముకుందని విమర్శించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో యువత ను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటర్లు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానిం చారు. 2017లో సాధించిన విజయాల తరహాలో కార్పొరేషన్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. విద్యుత్, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవ సాయం సంక్షోభంలో ఉందని అన్నారు. ఎల్‌నినో ప్రభావంపై ముం దుగానే హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం కాళేశ్వరం పంపులను వినియోగిం చడం లేదని విమర్శించారు. మేడిగడ్డపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని ఆరోపించారు.

సైబర్ క్రిమినళ్ల టార్గెట్‌లో భారత్

(మొదటిపేజీ తరువాయి)

హ్యాకింగ్ ముప్పులు పొంచి ఉన్నాయని నికోలస్ బట్స్ వివరించారు. మొదటిది చైనా కేంద్రంగా పనిచేస్తున్న స్టార్మ్ 3168 (జేడ్‌పఫ్ఫర్) ర్యాన్సమ్‌వేర్ ముఠా. ఏఐ ఏజెంట్లను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులు, సంస్థలపై వీరు భారీ ఎత్తున సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. రెండోది డేటా చౌర్యం కోసం స్టార్మ్ 0940 కాగా, మూడోది 'ఈవిల్‌టోకెన్స్' అటానమస్ నెట్‌వర్క్. ఇద్దరు వ్యక్తులు ఓపెన్–సోర్స్, క్లోజ్డ్–సోర్స్ మోడల్స్ సాయంతో పూర్తిగా స్వయంప్రతిపత్తి గల సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌ను రూపొందించారని, దీనిని ఒక్కొక్కరికి 1,500 డాలర్లు, నెలకు 500 డాలర్ల సబ్‌స్క్రిప్షన్‌తో అమ్ముతూ సైబర్ నేరాలను ప్రోత్సహించారని వివరించారు. ఈ నెట్‌వర్క్ ద్వారా 120 దేశాల్లోని 10,000కు పైగా సంస్థలు నష్టపోయాయని పేర్కొన్నారు. భారత్ వేగంగా డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు సైబర్ రక్షణ వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

358 మండలాల్లో కరువు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్లు సంబంధిత అధికారులతో వారానికోసారి సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. భూగర్భ జలమట్టాలు, వాతావరణ పరిస్థితులు, కరువు తీవ్రతపై మండలాల వారీగా గణాంకాలతో కూడిన నివేదికలను ప్రతి వారం విడుదల చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు, నీటి సంరక్షణ చర్యలు, వ్యవసాయ సలహాలను ప్రజలకు చేరవేసేందుకు మీడియా సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

గ్రామీణ ఉపాధికి చర్యలు

కరువు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, రైతులకు సహాయం, గ్రామీణ ఉపాధి అవకాశాల కల్పనకు కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు అత్యవసర నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు రూ.7 వేల కోట్లతో కరువు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. చెరువుల్లో నీటి మట్టాలు తగ్గడంతో చేపల మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. చేపల పెంపకానికి పెద్ద రిజర్వాయర్లను వినియోగించడంతో పాటు పశువులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు.

రిజర్వాయర్లలో 170 టీఎంసీలే

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో కనిష్ఠ వర్షపాతం నమోదవగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివరించారు. తక్కువ వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండటం తదితర ప్రమాణాల ఆధారంగా ప్రాథమికంగా 358 మండలాల్లో కరువు పరిస్థితులను గుర్తించినట్లు తెలిపారు. 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర రిజర్వాయర్లలో సాధారణంగా ఉండాల్సిన 470 టీఎంసీల నీటికి బదులుగా ప్రస్తుతం 170 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. సింగూరు జలాశయంలో నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రతి జిల్లాకు అత్యవసర నిధుల కింద ఇప్పటికే రూ.కోటి చొప్పున విడుదల చేసినట్లు వివరించారు.

కరువు నివారణలో సర్కార్ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ఆకులు పట్టుకున్నట్టేనని శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. అసమర్థుడికి అధికారం అప్పగిస్తే పాలన అస్తవ్యస్తంగా ఉంటుందని ధ్వజమెత్తారు. కరువు రాగానే చేతులెత్తేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి నీటిని ఎత్తిపోసేందుకు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త సమస్య అయినప్పుడు, పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నీటి పరిస్థితి ఎలా ఉందో వివరించాలని కోరారు. తెలంగాణ రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడానికి కారణాలేమిటో చెప్పాలన్నారు. బొగ్గు నిల్వలు, విద్యుత్ సంక్షోభంపై ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నా, రైతులు ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్నా పాలకులు స్పందించడం లేదని విమర్శించారు. కరువును ఎదుర్కొనేందుకు నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం, ఉపాధి కల్పనపై సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నీరు ఇవ్వలేమని ముందుగానే చేతులెత్తేయడం పాలనా దక్షత కాదన్నారు. కరువుతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతోపాటు రైతు బీమా, పంటల బీమా పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు పశుగ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకుని, అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసేవారన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ తీసుకున్న చర్యలు, ప్రజల్లో ధైర్యం నింపేందుకు చేసిన ప్రయత్నాలను గుర్తుచేశారు. కేసీఆర్‌పై విమర్శలకు చూపుతున్న శ్రద్ధలో కొంతైనా ప్రజలకు నీరు అందించడంపై చూపాలని హితవు పలికారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజాపాలన అనిపించుకోదని వ్యాఖ్యానించారు. బియ్యం ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి పరిస్థితి, కరువు నివారణకు కేటాయించిన నిధుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో పేరుతో ప్రజలను భయపెట్టడం, ప్రతిపక్షాలపై నిందలు వేయడం మానుకొని కరువును ఎదుర్కొనే కార్యాచరణ ప్రకటించాలన్నారు. కేసీఆర్‌ను విమర్శించినంత మాత్రాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పెరగవని, విద్యుత్ సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలకు వాడుకోవడం కాకుండా ప్రజలకు అండగా నిలవాలని హరీశ్ రావు సూచించారు.



40శాతం ధర తగ్గిన మలేరియా టీకా

- 10 లక్షల మంది చిన్నారులకు అదనపు రక్షణ
- ఎక్స్ వేదికగా పేర్కొన్న భారత్ బయోటెక్

న్యూఢిల్లీ: మలేరియా నివారణ టీకా ధరను హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ దాదాపు 40 శాతం తగ్గించింది. ఈ నిర్ణయంతో మరో 10 లక్షల మంది పిల్లలకు టీకా రక్షణ లభించడంతోపాటు 5 కోట్ల డాలర్లు ఆదా అవుతాయని సంస్థ శుక్రవారం వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి బాలల నిధి (యునిసెఫ్) కుదుర్చుకున్న ఒప్పందం, అంతర్జాతీయ టీకా కూటమి 'గవి' అందిస్తున్న ఆర్థిక సహకారంతో ఈ ధర తగ్గింపు చేపట్టినట్లు భారత్ బయోటెక్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొంది. గ్లాక్సోస్మిత్‌క్లైన్ అభివృద్ధి చేసిన ఆర్‌టీఎస్, ఎస్/ఏఎస్01 టీకాను భారత్ బయోటెక్ 'మాస్కివాక్' బ్రాండ్‌తో తయారు చేస్తోంది. ప్రపంచంలోనే తొలి మలేరియా టీకాగా దీనికి గుర్తింపు ఉంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నిమిషానికి ఒక చిన్నారి మలేరియాతో మరణిస్తున్న నేపథ్యంలో ఈ ధర తగ్గింపు కీలకమని సంస్థ తెలిపింది.

తుమ్మిడిహెట్టి ఎత్తుపై పట్టు

ప్రజానావ, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో చర్చలు జరిపేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన, అటవీ, గిరిజన ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం తదితర వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు, డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటిని అందించే విషయంలో పాలమూరు ప్రాజెక్టు ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా మధ్యేమార్గాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమైన మొత్తం 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా లిఫ్ట్ చేసి ఏదుల రిజర్వాయర్‌కు చేర్చేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలని స్పష్టం చేశారు. తద్వారా పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు గండిపడకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని బోధి పెవిలియన్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతోపాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటి సరఫరా, వాటి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకోవచ్చు? 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తరలించవచ్చు? అనే అంశాలపై ఇంజినీర్లు ముఖ్యమంత్రికి వివరించారు. బ్యారేజీ ఎత్తును బట్టి నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ప్రాజెక్టు ప్రయోజనాల్లో వచ్చే మార్పులను వివరించారు. 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే సుమారు 2,300 ఎకరాల భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు విస్తీర్ణం వెయ్యి ఎకరాల్లోపే ఉంటుందని అధికారులు వివరించినట్లు తెలిసింది. మహారాష్ట్ర పరిధిలో గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని అధికారులు పేర్కొన్న నేపథ్యంలో, ముంపు ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంటూనే తెలంగాణకు సాధ్యమైనంత ఎక్కువ నీటిని అందుబాటులోకి తెచ్చేలా బ్యారేజీ నిర్మాణంపై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. గతంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించినప్పటికీ, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకే 152 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి అంగీకరించేలా బలమైన సాంకేతిక వాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అత్యంత వెనుకబడిన అటవీ, గిరిజన ప్రాంతాలకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ద్వారా సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఏళ్ల తరబడి పోరాడిన అటవీ ప్రాంత ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం చేకూరాలని ఆకాంక్షించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల వాతావరణంలో చర్చలు జరగాలని, తెలంగాణ నీటి అవసరాలను సమర్థంగా వివరించి ఒప్పించే ప్రయత్నం చేయాలని మంత్రులకు సూచించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు రాష్ట్రాల అధికారుల మధ్య జరిగిన సమావేశాల్లో చర్చించిన అంశాలు, కేంద్రం కోరిన వివరాలన్నింటినీ సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి లభ్యత, బ్యారేజీ ఎత్తు, ముంపు విస్తీర్ణం, సాంకేతిక అంశాలకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని స్పష్టం చేశారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన వెంటనే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే ప్రాజెక్టు మార్గ నిర్ధారణ, రూట్ డిజైన్లు, భూసేకరణ తదితర అంశాలపై దృష్టి సారించాలని ఇంజనీర్లను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తూనే ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు.

పాలమూరు ప్రయోజనాలకు లోటు లేకుండా..

డిండి ప్రాజెక్టుకు నీటిని నార్లాపూర్ నుంచి తరలించాలా? లేక ఏదుల రిజర్వాయర్ నుంచి తీసుకెళ్లాలా? అనే అంశంపై ఇటీవల మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, విజ్ఞప్తులపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ రెండు మార్గాల్లో నీటి తరలింపునకు అయ్యే వ్యయం, సాంకేతిక అనుకూలతలు, ప్రతికూలతలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే అయ్యే ఖర్చు, ఏదుల నుంచి తరలిస్తే అవసరమయ్యే వ్యయం, ప్రస్తుతం ఉన్న కాల్వలు, సొరంగ మార్గాల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటిని అందించేలా అదనపు నీటిని సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. ఈ ప్రతిపాదనకు సమావేశంలో పాల్గొన్న మంత్రులు మద్దతు తెలిపారు. డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల చొప్పున మొత్తం 0.6 టీఎంసీల నీటిని అదనంగా లిఫ్ట్ చేసి ఏదుల రిజర్వాయర్‌కు చేర్చే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల వరకు నీటిని తరలించేందుకు అవసరమైన ప్రత్యేక వ్యవస్థపై అధ్యయనం చేయాలని సూచించారు. ఎక్కడ పంపులు, పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేయాలి? ప్రస్తుతం ఉన్న కాల్వలు, సొరంగ మార్గాల సామర్థ్యం సరిపోతుందా? ఎక్కడైనా సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉందా? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించి, వెంటనే డిజైన్లు రూపొందించాలని ఇరిగేషన్ విభాగాన్ని ఆదేశించారు.

సాంకేతిక అధ్యయనానికి ఆదేశాలు

నీటి తరలింపు ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు రూపొందించాలని సీఎం రేవంత్ సూచించారు. అదనపు నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన పంపింగ్ వ్యవస్థలు, కాల్వల విస్తరణ, సొరంగాల సామర్థ్యం, ఇతర మౌలిక సదుపాయాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణం, నీటి పంపిణీ విషయంలో ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తకుండా, అందరికీ ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టు కింద సాగునీటి అవసరాలకు ఎలాంటి కోత విధించకుండా, డిండి, అచ్చంపేట ప్రాంతాలకు కూడా నీరు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అదనపు నీటి తరలింపు ఏర్పాట్లతో ఈ రెండు ప్రాజెక్టుల అవసరాలను తీర్చడంతోపాటు పాలమూరు ప్రయోజనాలను కాపాడవచ్చని అభిప్రాయపడ్డారు. సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, టన్నెల్ విభాగం కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సులకు కొత్త రంగులు!

- భారతీయులు, విదేశీయులకు వేర్వేరు కార్డులు
- కార్డులపై బ్లడ్‌గ్రూప్, అత్యవసర ఫోన్ నంబర్లు
- లెర్నింగ్ ట్యుటోరియల్‌లో ఉత్తీర్ణత మార్కులు 75 శాతానికి పెంపు
- కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ



న్యూఢిల్లీ: డ్రైవింగ్ లైసెన్సుల జారీలో కొత్త విధానాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రతిపాదించింది. భారతీయులు, విదేశీయులకు వేర్వేరు రంగుల లైసెన్స్ కార్డులు జారీ చేయడంతో పాటు, కార్డులపై రక్తవర్గం, మొబైల్ నంబరు, అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన వ్యక్తుల ఫోన్ నంబర్లను ముద్రించాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు సవరణలు ప్రతిపాదిస్తూ ముసాయిదాను విడుదల చేసింది. వయసు, చిరునామా ధ్రువీకరణకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా నోటరీ ముందు చేసిన అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనను తొలగించాలని పేర్కొంది. ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు గుర్తింపు కార్డు, ఈ–రేషన్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తదితరాలను గుర్తింపు, వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలుగా అనుమతించాలని ప్రతిపాదించింది. సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ కనీస వ్యవధిని 30 నిమిషాలుగా నిర్దేశించడంతో పాటు, అందులో ఉత్తీర్ణత మార్కులను 60 నుంచి 75 శాతానికి పెంచాలని సూచించింది. ఆధార్ ధ్రువీకరణతో పూర్తిచేసే ఎంపిక చేసిన ఆన్‌లైన్ సేవలకు రుసుము మినహాయింపు ఇవ్వాలని పేర్కొంది. లైసెన్సులో పేరు, చిరునామా వంటి వివరాల మార్పు దరఖాస్తులపై 15 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని, వ్యక్తిగత వివరాల మార్పునకు రుసుము వసూలు చేయకూడదని ప్రతిపాదించింది. ఈ ముసాయిదాపై అభ్యంతరాలు, సూచనలను నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుంచి 30 రోజుల్లోగా సమర్పించాలని మంత్రిత్వశాఖ కోరింది.

నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు

- శాంతిభద్రతల పూచీకత్తు నోటీసును సవాల్ చేస్తూ వేసిన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: ఇటీవల దేశ రాజధానిలో జరిగిన నిరసన ప్రదర్శనలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలపై ఆందోళనల్లో పాల్గొన్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించలేదు. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్కోర్టు తనకు జారీ చేసిన శాంతిభద్రతల పూచీకత్తు నోటీసును సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం రాత్రి తిరస్కరించింది. ఈ మేరకు జస్టిస్ సుబ్రమణ్యం ప్రసాద్ ఈ తీర్పును వెలువరించారు. అక్టోబర్ 16న మండి హౌస్ వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొన్న నేహా బోరాపై పోలీసులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నారని, ఆమెపై 12 ఉల్లంఘన కేసులు ఉన్నాయని ఢిల్లీ పోలీసుల తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు తెలిపారు. ఈ నిరసనలు, పూచీకత్తు నోటీసులు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేలా లేవని, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే వీటిని జారీ చేశామని వాదించారు. మరోవైపు, నేహా బోరా తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదిస్తూ.. నోటీసులు అస్పష్టంగా ఉన్నాయని, రాజ్యాంగంలోని 19, 21 వ ఆర్టికల్స్‌ను ఉల్లంఘించేలా ఉన్నాయని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

బెట్టింగ్, ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల మోసాలపై ఈడీ నజర్

ప్రజానావ, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్, మోసపూరిత పెట్టుబడి యాప్‌ల ద్వారా ప్రజల నుంచి భారీగా నిధులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంతర్రాష్ట్ర ముఠాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద నమోదైన కేసుకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 15 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ సహా పలు ప్రాంతాల్లో నిందితుల నివాసాలు, కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని పుణె సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేస్తోంది. గత వారం ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్‌లలో నిర్వహించిన సోదాల్లో లభించిన సమాచారం, ఆధారాల ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లోని ఏజెంట్లు, హవాలా కార్యకలాపాలతో సంబంధం ఉన్నవారిపై దృష్టి సారించినట్లు తెలిసింది.

పర్యాటకానికి పండుగ కళ

- దేశీయ విడిది కేంద్రాలపై 40శాతం పెరిగిన శోధనలు
- యువత, కుటుంబాల నుంచి భారీ ఆదరణ
- ఆధ్యాత్మిక క్షేత్రాల నుంచి పల్లెల దాకా పెరుగుతున్న ఆసక్తి
- వెల్లడించిన అంతర్జాతీయ డిజిటల్ వేదిక ఎయిర్‌బీఎన్‌బీ



న్యూఢిల్లీ: పండుగల సీజన్‌లో దేశీయ పర్యాటకానికి ఆదరణ పెరుగుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పండుగ సెలవుల్లో దేశీయ విడిది కేంద్రాల కోసం భారతీయులు ఆన్‌లైన్‌లో చేస్తున్న శోధనలు దాదాపు 40 శాతం పెరిగినట్లు వసతి బుకింగ్ వేదిక ఎయిర్‌బీఎన్‌బీ వెల్లడించింది. యువతతో పాటు పిల్లలున్న కుటుంబాలు ఈ వృద్ధికి ప్రధాన కారణమని తెలిపింది. యువతలో వారణాసి, ఉత్తర గోవా, దక్షిణ గోవా, కోల్‌కతా, బెంగళూరుపై ఆసక్తి పెరిగింది. జెన్–జీ ప్రయాణికుల శోధనలు దాదాపు 40 శాతం అధికమయ్యాయి. పిల్లలతో ప్రయాణించే కుటుంబాల శోధనలు 40 శాతానికి పైగా పెరిగాయి. శ్రీనగర్, కాంగ్రా, అమృత్‌సర్‌తో పాటు గువాహటి, నాసిక్, ఈస్ట్ ఖాసీ హిల్స్ ప్రాంతాలకూ ఆదరణ పెరిగింది. పర్యాటకులు ప్రముఖ నగరాలకే పరిమితం కాకుండా గ్రామీణ, పట్టణేతర ప్రాంతాలపైనా ఆసక్తి చూపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో విడిది కోసం శోధనలు 30 శాతానికి పైగా పెరిగాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లోని కురుంగ్ కుమే వంటి ప్రాంతాలపై ఆసక్తి పెరుగుతుండగా, సిమ్లా, మనాలీ వంటి ప్రముఖ పర్వత ప్రాంతాలకూ ఆదరణ కొనసాగుతోంది. 2026 సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 మధ్య ప్రయాణాల కోసం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో నమోదైన శోధనలను, గతేడాది ఇదే కాలంతో పోల్చి ఈ గణాంకాలను వెల్లడించినట్లు ఎయిర్‌బీఎన్‌బీ పేర్కొంది.

2030 నాటికి 35 కోట్ల ఉద్యోగాలు

- తయారీ, సేవా రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు
- లాజిస్టిక్స్‌లో 47 లక్షలు.. ఆటోమొబైల్ రంగంలో 25 లక్షల కొలువులు
- వస్త్ర పరిశ్రమలో మూడేళ్లలో 2 కోట్ల ఉద్యోగాలు: ఐడీఏ



న్యూఢిల్లీ: దేశంలో తయారీ, సేవా రంగాలు 2030 నాటికి 35 కోట్లకు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉందని వివిధ రంగాల నైపుణ్య మండళ్లు, పరిశ్రమ సంఘాల అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు నైపుణ్య శిక్షణ, ప్రాక్టికల్ అభ్యాసం, పరిశ్రమలు–విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేయాలని ఇండియా డిడాక్టిక్స్ అసోసియేషన్ (ఐడీఏ) పేర్కొంది. 2030 నాటికి ఆటోమొబైల్ రంగంలో 20–25 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, లాజిస్టిక్స్‌లో 47 లక్షల నైపుణ్య ఉద్యోగులు అవసరమవుతారని అంచనా. టెలికాం రంగంలో 10 లక్షల కొత్త కొలువులు, స్వచ్ఛ ఇంధన రంగంలో 44 లక్షలకు పైగా ఉద్యోగాలు ఏర్పడే అవకాశముంది. వస్త్రాలు, దుస్తుల పరిశ్రమలో వచ్చే మూడేళ్లలో దాదాపు 2 కోట్ల ఉద్యోగాలు వస్తాయని అంచనా వేసింది. ఉద్యోగాల కల్పనతో పాటు వాటికి అవసరమైన నైపుణ్యాలతో యువతను సిద్ధం చేయడం ముఖ్యమని ఐడీఏ తెలిపింది. అర్హతలకే పరిమితమైన విద్యకు బదులుగా ప్రాక్టికల్ నైపుణ్యాలు, పరిశ్రమల అనుభవం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర్చుకునే సామర్థ్యానికి ప్రాధాన్యమివ్వాలని సూచించింది. ఈ అంశాలపై నవంబర్ 25–27 తేదీల్లో బెంగళూరులో జరిగే 'డిడాక్ స్కిల్స్', 'డిడాక్ ఇండియా' కార్యక్రమాల్లో చర్చించనున్నట్లు వెల్లడించింది.

దేశం ముందు వాస్తవాలు పెట్టండి

- ప్రధాని మోడీకి ఖర్గే మూడు ప్రశ్నలు

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత, చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయన్న ఐటీబీపీ డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. చైనాకు ఇప్పటికే చాలాసార్లు క్లీన్ చిట్ ఇచ్చారని ఆరోపిస్తూ, దేశ భద్రతకు సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. జాతీయ భద్రత, ఆర్థిక భద్రత, దౌత్యపరమైన జవాబుదారీతనం అంశాలపై ప్రధానిని మూడు ప్రశ్నలు అడిగారు. ఈ మేరకు ఖర్గే 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో, అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)తో భారత సైనికులకు ఎదురవుతున్న ముఖాముఖి ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్నాయని ఐటీబీపీ డీజీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. డోక్లాం, గల్వాన్ ఘటనల తర్వాత మరో తీవ్రమైన సైనిక ప్రతిష్టంభన చోటుచేసుకుంటోందా అని ప్రశ్నించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లకు సంబంధించిన నివేదికలు ఆగస్టులోనే వెలువడ్డాయని ఖర్గే గుర్తుచేశారు. వాచా–దమాయ్ ప్రాంతంలో కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు జరిగి 47 రోజులు గడిచినా ఘర్షణలు కొనసాగుతున్నట్లు వార్తలు రావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వాచా–దమాయ్ ప్రాంతం తక్సింగ్‌కు సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉందని ఆయన తన పోస్టులో ప్రస్తావించారు.



విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు కీర్తి శ్రీనివాస్‌కు కవిత పరామర్శ

ప్రజానావ, కొండాపూర్: కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకుడు కీర్తి శ్రీనివాస్‌ను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ పార్టీల ప్రతినిధులు



ప్రజానావ, ఖైరతాబాద్: విజయదశమి పర్వది నాన్ని పురస్కరించు కుని ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ డిప్యూటీ కమిషనర్ శంకర్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించా రు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బాలాజీ గోస్వామి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కాటూరి రమేష్, బీఎస్పీ ప్రతినిధి ప్రవీణ్ కుమార్, ఎంఐఎం ప్రతినిధి మహమ్మద్ మోసిన్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, సహాయ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు. విజయ దశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో పరస్పర సౌహార్ధం, శాంతి, సంతోషాలను నింపాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

వర్షాభావంతో ఎరువుల వ్యాపారులకు కష్టాలు

- సాగు మందగించడంతో తగ్గిన అమ్మకాలు
- నిలిచిపోయిన పెట్టుబడులు
- బకాయిల వసూళ్లలో ఇబ్బందులు



ప్రజానావ, కౌటాల: వర్షాభావ పరిస్థితులు రైతులనే కాకుండా వ్యవసా య అనుబంధ రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నా యి. ఇప్పటికే తాగు, సాగు నీటికి ఇబ్బందులు మొదలవ గా, సీజన్ ప్రారంభంలోనే సాగు చేపట్టిన రైతులకు వర్షా లు ముఖం చాటేయడంతో పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు వర్షాలపై అనిశ్చితి, సాగుపై సందిగ్ధత, పెట్టుబడులపై ఆందోళన ఎరువుల వ్యాపా రులను కలవరపెడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక పంటల సాగు మందగించడంతో ఎరువులు, విత్తనాల అమ్మకాలు తగ్గుతాయనే ఆందోళన వారిని వెంటా డుతోంది. కౌటాల మండలంలో మొత్తం 56 ఎరువుల దుకాణాలు ఉండగా, వాటిలో 52 క్రియాశీలకంగా ఉన్నాయి. దుకాణదారులు ముందస్తుగా ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నప్పటికీ, వర్షాలు లేక సాగు ముందుకు సాగకపోవడంతో అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీంతో సరుకు నిల్వలు పెరిగి పెట్టుబడులు నిలిచిపోతు న్నాయి. రైతులకు అప్పుగా విక్రయించిన ఎరువులు, విత్తనాల డబ్బులు సకాలంలో వసూలు కాకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. మరోవైపు సరఫరాదారులకు చెల్లింపులు, దుకాణాల నిర్వహణ ఖర్చులు భారంగా మారుతున్నాయి. సాధారణంగా రైతులు సాగు సమయంలో దుకాణదారుల వద్ద అప్పుగా ఎరువులు, విత్తనాలు తీసుకుని పంట ఉత్పత్తులను విక్రయించిన తర్వాత బకాయిలు చెల్లిస్తుంటారు. అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతినడం, పెట్టుబడులు తిరిగి వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రైతుల నుంచి బకాయిలు వసూలు చేయలేక డీలర్లు సతమతమవుతున్నారు. రైతుల నుంచి డబ్బులు అందినా, అందకపోయినా సరఫరాదారులకు నిర్ణీత సమయంలో చెల్లింపులు చేయాల్సి ఉండటంతో వ్యాపారులపై ఒత్తిడి పెరుగుతోంది. వ్యాపారం మందగించడం, పెట్టుబడులు నిలిచిపోవడం, సరుకు నిల్వలు పెరగడం, బకాయిలు పేరుకుపోవడంతో ఎరువుల దుకాణాల నిర్వహణ సవాలుగా మారిందని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసి సాగు ఊపందుకుంటేనే వ్యాపార పరిస్థితులు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రూ.18.5 కోట్ల భవనాన్ని వినియోగంలోకి తేవాలి

బీఆర్ఎస్ నాయకుడు సీతారాం ధూళిపాళ

ప్రజానావ, మణికొండ: ప్రజాధనంతో రూ.18.5 కోట్ల వ్యయంతో నిర్మించిన మణికొండ నూతన మున్సిపల్ భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీతారాం ధూళిపాళ అభ్యంతరం వ్యక్తం చేశారు. నూతన భవనం అందు బాటులో ఉన్నప్పటికీ నార్సింగి సర్కిల్–45 కార్యాలయంలో స్థలాభావం, పార్కింగ్ సమస్యలు, మరుగుదొడ్ల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడం వల్ల ప్రజాధనం సద్వినియోగం కావడం లేదని విమర్శించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రస్తుత కార్యాలయంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు సర్కిల్–45 కార్యాలయాన్ని మణికొండలోని నూతన భవనానికి వెంటనే తరలించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికారులు స్పందించి భవనం వినియోగంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుట్టమిది నరేందర్, సాయి రెడ్డి, అందే లక్ష్మణరావు, సుమనలిని తదితరులు పాల్గొన్నారు.

చుక్క నీటినీ వృథా చేయొద్దు!

- **హైదరాబాద్‌లో 20 శాతం నీరు ఆదా చేస్తే రోజుకు 30.28 కోట్ల లీటర్లు మిగులు**
- **రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలపై ఒత్తిడి.. 271 మండలాల్లో పడిపోయిన నీటిమట్టాలు**



ప్రజానావ, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అధిక నీటి వినియోగం రాష్ట్రంలో జల సంక్షోభం ముప్పును పెంచుతు న్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే బోర్లు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించుకోవడమే కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలో రోజుకు 14.5 లక్షల నల్లా కనెక్షన్ల ద్వారా సుమారు 1.30 కోట్ల మందికి 560 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో కనీసం 20 శాతం నీటిని ఆదా చేయగలిగితే రోజుకు 30.28 కోట్ల లీటర్లు మిగులుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నీటిని రోజుకు ఒక్కొక్కరికి 160 లీటర్ల చొప్పున 15 లక్షల జనాభా ఉన్న నల్గొండ వంటి జిల్లాకు ఒక రోజు సరఫరా చేయవచ్చని వివరిస్తున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే ఇంత నీటిని ఆదా చేసే అవకాశం ఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ పొదుపు పాటిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని పేర్కొం టున్నారు. వర్షపాతం లోటు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటిని అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

271 మండలాల్లో ఆందోళనకర పరిస్థితి

రాష్ట్రంలోని 271 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోయినట్లు భూగర్భ జలవనరుల శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటిలో 117 మండలాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు పేర్కొంటున్నాయి. హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మెదక్, మంచిర్యాల, హనుమకొండ, వరంగల్, నిర్మల్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లోని పలు మండలాల్లో పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇంట్లోనే పొదుపునకు ఎన్నో మార్గాలు

ప్రతి ఇంట్లో రోజువారీ నీటి వినియోగాన్ని పరిశీలిస్తే పొదుపునకు అనేక మార్గాలు కనిపిస్తాయి. నల్లాల లీకేజీలను అరికట్టడం, వంట సామగ్రిని శుభ్రం చేసేటప్పుడు, వాషింగ్ మెషిన్లు, షవర్లు, వాష్‌బేసిన్ల వద్ద నీటిని అవసరమైనంత మేరకే వాడటం ద్వారా వృథాను తగ్గించవచ్చు. మొక్కలకు పైపులతో నీటిని అధికంగా పోయకుండా, చెట్ల మొదళ్ల వద్ద నేరుగా నీరు చేరేలా చూడాలి. వాహనాలు కడగడం, ఇళ్ల నేలలను శుభ్రం చేయడం వంటి పనుల్లోనూ నీటిని పొదుపుగా వినియోగించాలి. దుస్తులను ఉతికేటప్పుడు నేరుగా పైపుల నుంచి నీటిని వాడటానికి బదులుగా బకెట్లను ఉప యోగించడం మేలు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడంతో పాటు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో వినియోగించిన నీరు భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి. నీటిని శుద్ధి చేసే ఆర్వో ఫిల్టర్లలోనూ వృథాను తగ్గించవచ్చు. సాధారణంగా కొన్ని ఫిల్టర్లు ఒక లీటరు శుద్ధి చేసిన నీటిని అందించేందుకు సుమారు రెండున్నర లీటర్ల నీటిని వినియోగిస్తాయి. ఇందులో వృథాగా వెళ్లే నీటిని ఇతర అవసరాలకు వినియోగించడం లేదా ఇంకుడు గుంతల్లోకి మళ్లించడం ద్వారా పొదుపు సాధ్యమవుతుంది. ఆర్వో కేంద్రాలు, పెద్ద మొత్తంలో నీటిని శుద్ధి చేసే కేంద్రాలు కూడా ఈ విధానాలను పాటిస్తే నీటి వృథాను గణనీయంగా తగ్గించవచ్చు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే రానున్న వేసవిలో సంక్షోభ తీవ్రతను కొంతవరకు తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



నిరుపయోగంగా స్కౌట్స్ శిక్షణ మైదానం

- నిర్మాణ సామగ్రి నిల్వకు అడ్డాగా మారిన వైనం
- నిధుల కొరతతో అసంపూర్తిగా కార్యాలయ భవనం
- కలెక్టర్ చొరవతో మైదానానికి మహర్దశ రావాలని స్థానికుల సూచన

ప్రజానావ, ఆదిలాబాద్ : జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ మైదానం నిరుపయోగంగా మారింది. సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానం ప్రస్తుతం గుత్తేదారుల నిర్మాణ సామగ్రి నిల్వకు, వాహనాల పార్కింగ్‌కు ఉపయోగపడుతోంది. నిధుల కొరతతో శిక్షణ కేంద్ర కార్యాలయ భవనం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయి మొండిగోడలకే పరిమితమైంది. గతంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు స్వచ్ఛందంగా సమకూర్చిన నిధుల నుంచి అప్పటి కౌన్సిల్ ఆమోదంతో రూ.లక్ష వెచ్చించి మైదానం చుట్టూ కంచె, ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. అయితే మైదానం సంరక్షణకు కాపలాదారు లేకపోవడంతో వెనుకవైపు కాలనీవాసులు కంచెను తొలగించి, మైదానం గుండా దారిని ఏర్పాటు చేసుకున్నారు. మైదానంలో కార్యాలయ భవనాన్ని పూర్తి చేసి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించే శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతు న్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని మైదానాన్ని అభివృద్ధి చేసి, సంరక్షణ చర్యలు చేపడితే కోట్ల రూపాయల విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా ఉంటుందని వారు సూచిస్తున్నారు.

మానవ మేధస్సును ఎప్పటికీ భర్తీ చేయలేని ఏఐ

- మానవ సంబంధాలు, ప్రజాసేవలో మానవీయ స్పర్శే కీలకం
- సాంకేతికతను సహాయకారిగా వాడుకోవాలి



ప్రజానావ, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎన్ని అభివృద్ధి దశలు దాటినా మానవ మేధస్సును, మానవ సంబంధాలను, భావోద్వేగాలను ఎప్పటికీ భర్తీ చేయలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా దానిని వినియోగించే విధానాన్ని బట్టే ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, ముఖ్యంగా ఏఐని యువత ఎప్పటికప్పుడు అందిపు చ్చుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో బంజారాహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'మానవ మేధోశక్తి–కృత్రిమ మేధస్సు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రొఫెసర్లు, మేధావులు, వైద్యులు, ఐటీ నిపుణులు పాల్గొని మానవ మేధస్సు, కృత్రిమ మేధస్సు మధ్య వ్యత్యాసాలు, వాటి ప్రభావంపై చర్చించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, రూపకల్పన, నిర్మాణ రంగాలతో పాటు అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులకు దోహదపడుతోందన్నారు. అయితే ఈ సాంకేతికతను సత్ప్రయోజనాల కోసం వినియోగించాలని, దుర్వినియోగం చేస్తే సమాజానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజకీయ రంగంలోనూ ఏఐ అనేక విధాలుగా ఉపయోగపడు తుందని, అంశాలపై సమగ్ర విశ్లేషణ, పూర్వాపరాల పరిశీలన, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సందేశాల రూపకల్పన, పోస్టర్ల తయారీ, ప్రచార కార్యక్రమాల ప్రణాళిక వంటి పనులను వేగంగా పూర్తి చేసేందుకు దోహదపడుతుందని వివరించారు. అయితే ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడం, ప్రజలతో మమేకం కావడం, వారి భావోద్వేగాలను గుర్తించడం, క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడం వంటి అంశాల్లో మానవ అనుభవానికి ప్రత్యామ్నాయం లేదన్నారు. రాజకీయాలు కేవలం సమాచార విశ్లేషణ, ప్రచార వ్యూహాలకే పరిమితం కావని, ప్రజలతో సంబంధాలు, స్థానిక పరిస్థితులపై అవగాహన, రాజకీయ సమీకరణాలు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి పక్షాన నిలబడి పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత నాయకులపై ఉంటుందని స్పష్టం చేశారు. ఏఐ సమాచారాన్ని అందించగలదు, విశ్లేషణ చేయగలదు, ప్రచారానికి అవసరమైన అంశాలను రూపొందించగలదు కానీ ప్రజల కష్టాలను స్వయంగా అర్థం చేసుకుని, వారి మధ్య నిలబడి సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకునే నాయకత్వానికి మానవీయ స్పర్శ అవసర మన్నారు. సాంకేతికతను మన పనులను సులభంగా, వేగంగా పూర్తి చేసుకునేందుకు సహాయకారిగా ఉపయోగించుకోవాలే తప్ప, ప్రతి విషయంలో దానిపైనే ఆధారపడకూడదని సూచించారు. ముఖ్యంగా యువత ఏఐపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు విచక్షణ, వివేచన, మానవీయ విలువలకు ప్రాధాన్యమివ్వాలని కీర్తిరెడ్డి పిలుపునిచ్చారు.





మహిళల విజయాలు సమాజానికి స్ఫూర్తి

- మహిళా సాధికారతతోనే దేశ సమగ్ర అభివృద్ధి
- సమాన అవకాశాలు, భద్రత, గౌరవం కల్పించాలి: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: మహిళలకు సమాన అవకాశాలు, స్వేచ్ఛ, భద్రత, గౌరవం కల్పించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. మహిళా సాధికారత సామాజిక న్యాయానికే కాకుండా దేశ సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 41వ దేవి అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకు లను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు విద్య, విజ్ఞానం, క్రీడలు, వ్యాపారం, కళలు, సంస్కృతి, ప్రభుత్వ సేవలు తదితర రంగాల్లో రాణిస్తూ దేశ ప్రగతికి తోడ్పడుతున్నారని తెలిపారు. మహిళ విద్యావంతు రాలై, ఆర్థిక స్వావలంబన సాధించి నాయకత్వం వహిస్తే ఆ ప్రయోజనాలు కుటుంబానికే కాకుండా సమాజం మొత్తానికి కలుగుతాయన్నారు. మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, బేటీ బచావో–బేటీ పఢావో, జననీ సురక్ష యోజన, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు వారికి అండగా నిలుస్తున్నాయని వివరించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా మూడు కోట్ల మంది మహిళలను స్వావలంబులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్ణీత గడువు కంటే ముందే సాధించారని, తదుపరి లక్ష్యాన్ని ఆరు కోట్లకు పెంచారని పేర్కొన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాలు మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలకు సొంత ఆదాయం, ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తే కుటుంబాలు బలోపేతమై సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి బాలికకు కలలు కనే, విద్యను అభ్యసించే, నాయకత్వం వహించే, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించాలని సూచించారు. కుటుంబాలు బాలికల ఆశయాలను ప్రోత్సహించాలని, విద్యాసంస్థలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని, ఉద్యోగ ప్రదేశాల్లో సమాన అవకాశాలతో పాటు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. దేవి అవార్డులు అందుకున్న పది మంది మహిళలు తమ తమ రంగాల్లో విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి కీర్తి తెచ్చిన షూటర్ ఈషా సింగ్, సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తున్న నటి, నిర్మాత నిహారిక కొణిదెల, జల సంరక్షణకు కృషి చేస్తున్న వాస్తుశిల్పి కల్పనా రమేశ్, కృత్రిమ మేధస్సుతో ఆహార భద్రతకు తోడ్పడుతున్న సాంకేతిక నిపుణురాలు వైశాలి నియోటియా సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహి స్తున్న విద్యా రావు, తెలంగాణ చేనేత కళను ముందుకు తీసుకెళ్తున్న ఫ్యాషన్ డిజైనర్ యక్షిణి దీప్తి రెడ్డి, హైదరాబాద్ వారసత్వ సంపద పరిరక్షణకు కృషి చేస్తున్న చరిత్రకారిణి పి. అనురాధా రెడ్డి, బాలికల విద్య, బాలల సంరక్షణ కోసం పనిచేస్తున్న విద్యావేత్త బొంపల్లి భవాని, తెలంగాణ తొలి మహిళా లైన్‌వుమన్ బబ్బూరి శిరీష, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ శిరీషా సెంథిల్ సేవలను అభినందించి అవార్డు గ్రహీతలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకమని, వార్తలను అందించడంతో పాటు సమాజ సేవ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థల సేవలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. కుటుంబంతో పాటు సమాజానికి సరైన దిశ చూపగల శక్తి మహిళలకు ఉందని పేర్కొంటూ, నశాముక్త భారత్ లక్ష్య సాధనలో మహిళలు, పౌరులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబ స్థాయి నుంచే మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, 2029 నాటికి నశాముక్త తెలంగాణ, నశాముక్త భారత్ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. దేవి అవార్డులు మహిళల విజయాలను గుర్తించి గౌరవించడంతో పాటు సమానత్వం, భద్రత, సాధికారతతో కూడిన భారత నిర్మాణానికి దోహదపడాలని గవర్నర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకీయ సంచాలకుడు ప్రభు చావ్లా, ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీ మీనన్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి

- సరాక పరిశ్రమ ప్రమాదంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆందోళన
- మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల పరిహారం

ప్రజానావ, హైదరాబాద్: సిగాచి పరిశ్రమ ప్రమాద విషాదం మరువకముందే జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీతో ఇద్దరు కార్మికులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపట్టడం లేదని విమర్శించారు. ప్రమాద సమాచారం అందుకున్న ఆయన ఘటనాస్థలాన్ని పరిశీలించి పరిశ్రమ యాజమాన్యం, అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. యాజమాన్యంతో చర్చించి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.70 లక్షల పరిహారంతో పాటు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మికుల ప్రాణ రక్షణకు ప్రాధాన్యమివ్వాలని, సిగాచి ఘటన నుంచి గుణపాఠం నేర్చుకుని ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.



గుట్టల్ని గుటుక్కుమనిపిస్తున్న మట్టి మాఫియా!

- అక్రమ తవ్వకాలతో కనుమరుగవుతున్న ప్రకృతి సంపద
- పట్టించుకోని అధికారులు
- మొరం తవ్వకాలపై కొరవడిన నిఘా
- చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట

ప్రజానావ, మహబూబ్‌నగర్ : నగరం చుట్టూ పచ్చని చెట్లతో అలరారే గుట్టలు ప్రాణవాయువును అందిస్తూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే అక్రమ తవ్వకాలతో ఈ ప్రకృతి సంపద ఒక్కొక్కటిగా కనుమరుగవుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మట్టి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జడ్చర్ల మండలం కోషిగుట్టలో అక్రమ తవ్వకాలు వెలుగులోకి రావడంతో జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలో గుట్టలను తవ్వి మొరం తరలించడం కొందరికి వ్యాపారంగా మారింది. ఇళ్లు, వ్యాపార సముదాయాలు, వెంచర్ల నిర్మాణాలకు అవసరమైన మొరాన్ని ముందుగానే ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఎక్కడ గుట్ట కనిపిస్తే అక్కడికి చేరుకుని అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. తవ్విన మట్టిని ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.800 నుంచి రూ.1,000 వరకు, టిప్పర్‌కు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి?

గుట్టలను యథేచ్ఛగా తవ్వుతున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కోయిలకొండ ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారి వెంట, హన్వాడ రోడ్డులో, తిరుమల హిల్స్, వీరన్నపేట, తువ్వగడ్డ తండా ప్రాంతాల్లో తరచూ అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నా తగిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గుట్టల తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లడంతోపాటు ప్రకృతి అందాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

తవ్వకాలపై నిఘా పెంచితేనే అడ్డుకట్ట

ఇటీవల జడ్చర్ల మండలం కోషిగుట్టలో అక్రమ తవ్వకాలపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు నాలుగు వాహనాలను పట్టుకున్నారు. అక్కడ సుమారు రూ.7 లక్షల విలువైన 3,870 టన్నుల మొరం, రాళ్లను తవ్వినట్లు గుర్తించారు. ఇదే తరహాలో నగర శివార్లతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ సమగ్ర తనిఖీలు నిర్వహిస్తే భారీ స్థాయిలో అక్రమ తవ్వకాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గుట్టలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసి, అక్రమంగా మొరం తరలించే వాహనాలను తనిఖీ చేయాలని సూచిస్తున్నారు.

నిబంధనల ప్రకారం లీజులు ఏర్పాటు చేస్తే ఆదాయం

పర్యావరణానికి విఘాతం కలగకుండా, నిబంధనలకు అనుగుణంగా తవ్వకాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి లీజులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు నిర్మాణ అవసరాలకు మొరం, మట్టి అందుబాటు ధరల్లో లభించే అవకాశం ఉంటుంది. అయితే పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ శాస్త్రీయ అధ్యయనం, అనుమతులు, పర్యవేక్షణ ఆధారంగానే తవ్వకాలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ ప్రాంతాల్లోనూ తవ్వకాలపై ఆరోపణలు

నగర శివార్లలోని కోయిలకొండ ఎక్స్‌రోడ్డు, మౌలాలిగుట్ట, అర్బన్ ఎకోపార్కు, ఏనుగొండ, ఎదిర, అప్పన్నపల్లి, జైనల్లీపూర్, తువ్వగడ్డతండా, దివిటిపల్లి, తిరుమల హిల్స్, వీరన్నపేటతోపాటు జడ్చర్ల శివార్లలోని కోషిగుట్ట, మల్లెబోయినపల్లి, చిట్టబోయినపల్లి తదితర ప్రాంతాల్లో గుట్టల తవ్వకాలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఈ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనుమతులున్నాయా? అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయా? అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రకృతి సంపదను కాపాడటంతోపాటు అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటేనే గుట్టల విధ్వంసానికి అడ్డుకట్ట పడుతుంది.

కొత్తగూడెంలో కార్డన్ సెర్చ్

- 49 వాహనాలపై జరిమానాలు
- 87 మద్యం సీసాలు స్వాధీనం
- మాదకద్రవ్యాలపై ప్రజలకు పోలీసుల అవగాహన



ప్రజానావ, కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సఫాయి బస్తీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో ఉదయం 4 నుంచి 7 గంటల వరకు కొత్తగూడెం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, రెండు త్రిచక్ర వాహనాలను గుర్తించి మొత్తం 49 వాహనాలపై చట్టప్రకారం జరిమానాలు విధించారు. అదేవిధంగా 87 ఐఎంఎఫ్ఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, ఎన్డీపీఎస్ చట్టం కింద ఎదురయ్యే పరిణామాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, వాటికి బానిసైన వారిని గుర్తించి వ్యసన విముక్తి కేంద్రాలకు తరలించేందుకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. పేకాట, జూదం, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని, మతసామరస్యాన్ని కాపాడాలని డీఎస్పీ కోరారు. ఈ తనిఖీల్లో సీఐలు ఇంద్రసేనారెడ్డి, జితేందర్‌తో పాటు సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాపై కరవు పంజా!

- 26 శాతం లోటు వర్షపాతం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పశుగ్రాసం, తాగునీటి కొరత ముప్పు
- ఎనిమిది నెలల గడ్డుకాలంపై అధికారుల కసరత్తు



ప్రజానావ, ఖమ్మం : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. గత జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే 26 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. సాగర్ ఆయకట్టు ఎండిపోతుండగా, భూగర్భ జలాలు లోలోతు లకు పడిపోతున్నాయి. రానున్న రోజుల్లో పశువులకు గ్రా సం దొరకని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలతో విద్యుత్తు వినియోగం పెరగడంతో వ్యవసాయ విద్యుత్తు సరఫరాలో అనధికార కోతలు విధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఎన్న డూ లేనివిధంగా జిల్లా కరవు ముప్పును ఎదుర్కొంటోంది. ఎలనినో ప్రభావం వచ్చే జూన్, జులై వరకు కొనసాగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తుండటంతో, రానున్న ఎనిమిది నెలల గడ్డుకాలాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలపై దృష్టి సారించింది.

పశుగ్రాసం కొరత ముప్పు

జిల్లాలో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు తదితర పశుసంపద సుమారు ఐదు లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఒక్కో పశువుకు రోజుకు సగటున ఐదు కిలోల గ్రాసం అవసరమని లెక్కించారు. ఈ ప్రకారం మొత్తం 7.50 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం కావాల్సి ఉండగా, ప్రస్తుతం ఐదు లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అంచనా. మధిర, బోనకల్లు, కామేపల్లి, కొణిజర్లతో పాటు మరో మూడు మండలాల్లో గ్రాసం కొరత తీవ్రంగా ఉంది. రానున్న నాలుగు నెలల తర్వాత ఈ సమస్య మరింత తీవ్ర మయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థి తిపై ప్రభుత్వానికి నివేదిక పంపడంతో పాటు పశుగ్రాస విత్త నాలను అందించాలని నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో వీబీజీ రామ్‌జీ పథకం కింద పనిదినాలను పెంచే చర్యలు చేపడుతున్నారు.

17 మండలాల్లో కరవు పరిస్థితులు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తక్కువ వర్షపాతం నమోదైన 17 మండలాల వివరాలతో కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వైరా, తల్లాడ, చింతకాని, తిరుమ లాయపాలెం మండలాలు మాత్రం ఈ జాబితాలో చోటు దక్కించుకోలేదు. అయితే ఆయా మండలాల్లో పరిస్థితులు సుభిక్షంగా ఉన్నాయని కాదు. అక్కడ కూడా కరవు ఛాయ లు కనిపిస్తున్నప్పటికీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జాబి తాలో చేర్చలేదు. జిల్లాలో భూగర్భ జలమట్టం 3.56 మీటర్ల లోతుకు పడిపోయినట్లు అధికారులు గుర్తించారు. బోర్ల కింద సాగులో ఉన్న పంటలను కాపాడుకునేందుకు రైతు లు అధికంగా విద్యుత్తు వినియోగిస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు అనధికార కోతలు విధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

తాగునీటి అవసరాలు తీర్చేదెలా?

ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లో ఉన్న నీరు మరో 99 రోజులకు మాత్రమే సరిపోతుందని అంచనా వేయగా, వైరా రిజర్వాయర్‌లోని నీరు 149 రోజులకు సరిపో తుందని లెక్కించారు. రానున్న ఎనిమిది నెలల్లో సుమారు 320 రోజుల తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉండటంతో ప్రస్తుత నిల్వలు సరిపోవనే ఆందోళన వ్యక్తమవుతోంది. గోదావరి జలాలను వైరా వరకు మళ్లించే అవకాశం ఉన్నప్పటికీ, పాలేరులోకి నీటిని తీసుకురావాలంటే నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. పాలేరు రిజర్వాయర్‌కు మూడు దశల్లో మొత్తం 4.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కలెక్టర్ ప్రభు త్వానికి నివేదిక పంపారు. ఈ మేరకు నీటి కేటాయింపులు జరుగుతాయా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్

- ఇద్దరు కార్మికులు మృతి
- జిన్నారం గడ్డపోతారంలో విషాదం
- ఘటనపై పోలీసుల దర్యాప్తు

ప్రజానావ, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో విషాదం చోటుచేసుకుంది. అక్కడి సరక రసాయన పరిశ్రమలో తెల్లవారుజామున గ్యాస్ లీక్ కావడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని గ్లూబా బ్లాక్‌లో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుదర్శన్ రావు (27), బాలాజీ (44) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్యాస్ లీక్‌కు గల కారణాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరిశ్రమల్లో భద్రత ఏదీ?

- సరాక ప్రమాదంపై హరీశ్‌రావు ఆగ్రహం
- మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్



ప్రజానావ, సంగారెడ్డి: జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్‌తో ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. మృతుల కుటుం బాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబా లకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దుర్మార్గమని మండిపడ్డారు. నాడు సిగాచి.. నేడు సరాక పరిశ్రమలో ప్రమాదం జరిగిందని, గత చేదు అనుభవాల నుంచి ప్రభుత్వం ఏం నేర్చుకోలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటోందని ఆరోపించారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు ప్రశ్నార్థకంగా మారిందని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత వచ్చి ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్నదేమిటని నిలదీశారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగా టమాడుతున్న పరి శ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు ఎప్పుడు తీసు కుంటారని ప్రశ్నించారు. సరాక పరిశ్రమ ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన యాజ మాన్యం పై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృ తం కాకుండా పరిశ్రమల్లో భద్ర తా చర్యలను పటిష్టం చేయాలని, ఉపాధి కోసం వచ్చిన కార్మికుల ప్రాణా లకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. సిగాచి ప్రమాదంలో ఇంటి పెద్దను కోల్పోయిన 54 కార్మిక కుటుంబాలకు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన కోటి రూపాయల పరిహారాన్ని ఇప్పటికైనా అందించి మాట నిలబెట్టుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఉమ్మడి మెదక్ జిల్లాపై ఎల్‌నినో పంజా

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- విద్యుత్తు కోతలతో ఎండుతున్న పంటలు
- తాగునీటి సరఫరాకు నీటి కొరత
- యాసంగి సాగుపై అన్నదాతల్లో అయోమయం



ప్రజానావ, మెదక్ : ఎలనినో ప్రభావంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో కరవు ఛాయలు అలుముకుంటున్నాయి. వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. మరోవైపు విద్యుత్తు కోతలతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో పర్యటించిన ప్రత్యేకాధికారి వాణిప్రసాద్‌కు మూడు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు వివరించారు. సంగారెడ్డి జిల్లాను పూర్తిగా కరవు ప్రాంతంగా ప్రకటించాలని నివేదించారు. సిద్దిపేట జిల్లాలోని 16, మెదక్ జిల్లాలోని 12 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని కరవు మండలాలుగా ప్రకటించాలని కోరారు. సింగూరు ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 2,395 గ్రామీణ ఆవాసాలు, 19 పట్టణ స్థానిక సంస్థలకు నీటి సరఫరా జరుగుతోంది. మరో రెండు నెలల పాటు తాగునీటిని సరఫరా చేయాలంటే 6.96 టీఎంసీల నీరు అవసరం కాగా, ప్రస్తుతం 3.95 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందు లోనూ మూడు టీఎంసీల వరకు మాత్రమే వినియోగిం చుకునే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. దసరా అనంతరం సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలతో పాటు మిషన్ భగీరథ గ్రిడ్ పరిధిలోని ప్రాంతాలకు రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తామని సంబంధిత అధికారులు ప్రకటిస్తున్నారు.

పంటలు చేతికొచ్చేనా?

సిద్దిపేట జిల్లాలో 3,22,935 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటివరకు 32 వేల ఎకరాల్లోని పంట మాత్రమే చేతికందే పరిస్థితి ఉందని అంచనా. మిగిలిన పంటకు మరో రెండు తడుల నీరు అందితేనే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో 3.25 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే విద్యుత్తు కోతలు, బోరుబావులు ఎండిపోవడంతో లక్ష ఎకరాల్లో పంట దిగుబడిపై అనిశ్చితి నెలకొంది. సంగారెడ్డి జిల్లాలోనూ 36 వేల ఎకరాల్లో వరి పంట పరిస్థితి ఆందోళనకరంగా మారింది. సాగునీరు అందకపోవడంతో పెట్టుబడులు చేతికందుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యాసంగి సాగుపై అయోమయం

ఇటీవల సింగూరు జలాశయాన్ని పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు యాసంగి సీజన్‌లో పంట విరామం పాటించాలని రైతులకు సూచించారు. మరోవైపు మూడు జిల్లాల వ్యవసాయ అధికారులు వరి సాగుకు విరామం ఇచ్చి ఆరుతడి పంటల వైపు మళ్లాలని రైతులకు దిశానిర్దేశం చేస్తున్నారు. దీంతో ఏ పంట సాగు చేయాలి, అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలనే విషయంలో అన్నదాతలు అయో మయానికి గురవుతున్నారు. వర్షాభావం, భూగర్భజలాల తగ్గుదల, విద్యుత్తు కోతలు ఒకవైపు.. తాగునీటి అవసరాలు, యాసంగి సాగు ప్రణాళిక మరోవైపు ఉమ్మడి జిల్లాను కరవు ముప్పు దిశగా నెట్టుతున్నాయి.



భూముల రీ–సర్వే పనుల పరిశీలన

సదాశివునిపాలెంలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజానావ, నత్తపల్లి: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సదాశివుని పాలెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ–సర్వే పనులను సబ్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత బృందం ద్వారా భూముల వివరాలను తనిఖీ చేశారు. గ్రామ పరిధిలో మొత్తం 1,163.16 ఎకరాల భూమి ఉండగా, అందులో 236.20 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రీ–సర్వే పనులు పూర్తయినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియలో భూముల హద్దులు, విస్తీర్ణాలు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకో వాలని సూచించారు. భూముల రీ–సర్వే పనులను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు వివరించారు.

ట్యాంకర్ల నీటితో పంటలకు తడులు

- మూడు బోర్లు వేసినా దక్కని నీరు..
- అప్పుల ఊబిలో అన్నదాతలు
- భూగర్భ జలాలపై అవగాహన కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి
- నీరు వృథా కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ప్రజానావ, జోగుళాంబ గద్వాల : పంట చేతికి వస్తుందన్న ఆశతో లక్షల రూపాయలు అప్పులు చేసి సాగు చేస్తున్న రైతులకు సాగునీటి కొరత శాపంగా మారుతోంది. భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లలో నీరు తగ్గిపోవడం, ఎండ తీవ్రత పెరగడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నా పంటలకు సరిపడా నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామంలో పలువురు రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ ట్యాంకర్లతో నీటిని తెప్పించి, అర్ధరాత్రి వేళల్లోనూ ట్రాక్టర్ల ద్వారా పొలాలకు తరలిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు వెంకటన్న, వీరేష్ పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. మిరప పంటకు నీరు అందకపోవడంతో ఇటీవల మూడు కొత్త బోర్లు వేయించినా చుక్క నీరు లభించలేదు. ప్రస్తుతం రోజుకు సుమారు పది ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తూ పంటను కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. గ్రామంలోనే కాకుండా మండలంలోని పలు ప్రాంతాల్లోనూ బోర్లు విఫలమై రైతులు పెట్టుబడులు నష్టపోతున్నారు. సాగు ఖర్చులకు తోడు నీటిని కొనుగోలు చేయాల్సి రావడంతో ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. ప్రస్తుతం వేసవిని తలపించేలా ఎండల తీవ్రత పెరుగుతుండటంతో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, వ్యవసాయ, భూగర్భ జలాల శాఖల అధికారులు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. బోర్లు వేయడానికి ముందే భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని, బోర్లు విఫలమై నష్టపోయిన వారికి వర్తించే ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఆర్థిక సాయం గురించి స్పష్టమైన సమాచారం అందించాలని సూచిస్తున్నారు. సాగునీటి కొరతను ఎదుర్కొంటున్న రైతులకు అవసరమైన సహకారం అందించి, వారి పెట్టుబడులు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటున్నారు.

ఎలుకల పాలవుతున్న వెల్‌నెస్ సెంటర్ మందులు

- రేకుల షెడ్డులో ఇరుకు గదిలో నిర్వహణ
- ఎండకు, వానకు ఔషధాల నిల్వ

ప్రజానావ, నిజామాబాద్ : నిజామాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌ను సమస్యలు వెంటాడుతున్నాయి. మందుల నిల్వ విభాగంలో ఎలుకలు సంచరిస్తూ మాత్రలను కొరికి నాశనం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అపరిశుభ్ర వాతావరణంలో ఔషధాలను నిల్వ చేయాల్సి వస్తుండటంతో వాటి భద్రత, నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వెల్‌నెస్ సెంటర్ గతంలో పాత కలెక్టరేట్ వెనుక ఉన్న రెవెన్యూ భవనంలో కొనసాగేది. కలెక్టరేట్ భవనాన్ని కూల్చివేయడంతో జీజీహెచ్ నాలుగో అంతస్తుకు తరలించారు. మెట్లు ఎక్కడం, రద్దీగా ఉండే లిఫ్ట్‌లో పైకి వెళ్లడం ఇబ్బందిగా మారడంతో రోగుల రాక తగ్గింది. దీంతో వెనుకవైపు ఉన్న మెప్మా భవనంలోకి మార్చారు. కొవిడ్ తర్వాత ప్రత్యామ్నాయంగా మున్సిపల్ పాత కార్యాలయం వెనుక ఉన్న రేకుల షెడ్డుకు తరలించారు. ప్రస్తుతం ఒకే ఇరుకు గదిలో ఓపీ నిర్వహించడంతోపాటు మందులను నిల్వ చేస్తున్నారు. వైద్యసేవల కోసం వచ్చే వారు ఓపీ తీసుకోవాలన్నా, మందులు పొందాలన్నా ఎండలో లేదా వర్షంలో బయట



వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

పరిసరాల్లో అపరిశుభ్రత

వెల్‌నెస్ సెంటర్ వెనుకవైపు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మలేరియా, ఇంజినీరింగ్ విభాగాల గోదాంలు ఉన్నాయి. కేంద్రంలోని ఓ మూల గదిలో పాత కుర్చీలు, టేబుళ్లు, ఇతర సామగ్రిని పడేశారు. గోదాంల వైపు నుంచి వస్తున్న ఎలుకలు మందుల నిల్వ గదిలోకి చేరి మాత్రలను కొరుకుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేకుల పైకప్పు కారణంగా ఎండ, వానల ప్రభావం ఔషధాల నిల్వపై పడే ప్రమాదం ఉందని విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్‌ను జీజీహెచ్ కింది అంతస్తులోని రెండు గదుల్లోకి మార్చాలని, వైద్య నిపుణులను నియమించాలని కోరుతున్నారు.

లబ్ధిదారులు వేలల్లో

ఈ కేంద్రం పరిధిలో సుమారు 21 వేల మంది పింఛనర్లు, 18 వేల మంది ఉద్యోగులు, 800 మంది జర్నలిస్టులు ఉన్నారు. రోజుకు సుమారు 180 మంది ఓపీకి వస్తున్నట్లు వివరాలు చెబుతున్నాయి. ఇంతమందికి సేవలందించే కేంద్రంలో తగిన వసతులు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ర్యాక్‌లో ఉంచిన కొన్ని విటమిన్ మాత్రలను ఎలుకలు కొరికాయని, వాటిని మరో డబ్బాలో షీట్లు వేసి భద్రపరిచినా అదే పరిస్థితి ఎదురైందని వెల్‌నెస్ సెంటర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. అయితే మిగతా ఔషధాలను ఎలుకలు ముట్టుకోవడం లేదని ఆమె పేర్కొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమం




ప్రజానావ, సిరిసిల్ల : విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా శుక్రవారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాఖ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని, పోలీస్ స్టేషన్ విధులు, ప్రజలకు అందించే సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల బాధ్యతలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, పోలీస్ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు చేరువగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిర్వహించే డే, నైట్ బీట్స్, పెట్రోలింగ్ విధానాలతో పాటు, పోలీస్ స్టేషన్ పనితీరు, బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. నేరస్తులను గుర్తించేందుకు పోలీసు శాఖ వినియోగిస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాల పనితీరును వివరించారు. బాంబ్ స్క్వాడ్ బృందం విధులు, పేలుడు పదార్థాలను గుర్తించి నిర్వీర్యం చేసే విధానం, పోలీస్ జాగిలాల సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ లు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయి కిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైపని అడ్డా యజమానుల సంఘం అధ్యక్షుడిగా మ్యాన రాజు ఎన్నిక

ప్రజానావ, సిరిసిల్ల: వైపని అడ్డా యజమానుల సంఘం నూతన అధ్యక్షుడిగా మ్యాన రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సిరిసిల్లలోని అమృత్‌లాల్ శుక్ల కార్మిక భవనంలో మూషం రమేష్ అధ్యక్షతన జరిగిన అడ్డా యజమానుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలు: అధ్యక్షుడిగా మ్యాన రాజు, ఉపాధ్యక్షులుగా గుంటూరు వెంకటేశం, అంబాదాస్, ప్రధాన కార్యదర్శిగా బూర మధు, సహాయ కార్యదర్శులుగా బిక్షపతి, దేవరాజు, కోశాధికారిగా బూర రవి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా వాసం పోశెట్టి, గడ్డం నరసయ్య, ఎరువు శీను, బచ్చు శ్రవణ్ ఎన్నికయ్యారు.

గూడూరు పల్లగుట్ట గనుల అనుమతులను పునఃపరిశీలించాలి

- తవ్వకాలను నిలిపివేయాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి సీపీఐ నేతల వినతి



ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు పల్లగుట్ట వద్ద మంజూరు చేసిన గనుల తవ్వకాల అనుమతులను పునఃపరిశీలించి, తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ ముఖ్య కార్యదర్శి అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం సమర్పించారు. పల్లగుట్ట తవ్వకాల వల్ల గ్రామ ప్రజలకు, పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించిన నాయకులు.. అనుమతులపై సమగ్ర విచారణ జరిపి, వాటిని రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు గీస భిక్షపతి, పల్లగుట్ట పరిరక్షణ కమిటీ కన్వీనర్, గూడూరు మాజీ సర్పంచ్ చాకలి రమేశ్, కమిటీ నాయకుడు చెరుకు ఎల్లం, హైకోర్టు న్యాయవాది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో వరి పంటకు నీరు

వర్షాభావం, విద్యుత్ కోతలతో కౌలు రైతు అవస్థలు



ప్రజానావ, మంచిర్యాల: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లముందే ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు రాంటెంకి దేవయ్య నీరు లేక ఎండిపోతున్న వరి పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో ఒక మడికి నీరు అందిస్తే మరో మడి ఎండిపోతోందని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాంకర్లతో పొలానికి నీరు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంటలకు సరిపడా నీటిని అందించడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని కోరారు.

భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

కుటుంబ సమేతంగా ఈవో చండీ హోమం



ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దసరా, బతుకమ్మ సెలవుల నేపథ్యంలో తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని కోడె మొక్కులు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి కుటుంబ సమేతంగా స్వామివారి సన్నిధిలో శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలి


- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సంస్థాగత రుణాలపై వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులకు అవగాహన



ప్రజానావ, సిరిసిల్ల : బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ సంవాద్ పేరిట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ సంవాద్ కార్యక్రమం ద్వారా చేనేత, పవర్‌లూమ్ రంగాలకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులకు సంస్థాగత రుణాలపై అవగాహన కల్పించడం, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించడం, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా ఆదాయం, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి మార్గనిర్దేశం ఆర్బీఐ ఎల్డీఓ శ్రీ చేతన్ సంస్థాగత రుణాల ప్రాధాన్యత, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు. వీవర్లు వివిధ మార్గాల్లో రుణాలు తీసుకోవడం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సమస్యలను వివరించి, అనధికారిక రుణాలపై ఆధారపడకుండా బ్యాంకులను సంప్రదించి, తమ అవసరాలకు అనుగుణంగా తగిన రుణ సదుపాయాలను పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణాలు పొందుతూ, వాటిని తమ వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆర్థికంగా ఎదిగి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. చేనేత పవర్‌లూమ్‌ల ద్వారా ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మరింత నాణ్యమైన, ఆకర్షణీయమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. చేనేత వస్త్రాల తయారీ వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు మార్పు చెందాలని, సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డీఓ చేతన్, నాబార్డ్ డీ డీ ఎం దిలీప్ చంద్ర, ఎల్ డీఎం రాజీవ్ కుమార్, ఇండస్ట్రీస్ం జీఎం హనుమంతు, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్‌లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు

- చక్రవడ్డీలతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు వేధింపులు
- లైసెన్సులు లేకుండానే ఫైనాన్స్ దందా



ప్రజానావ, నిజామాబాద్ : జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లో వడ్డీ వ్యాపారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రోజువారీ అవసరాల కోసం చిరువ్యాపారులు, వైద్యం, విద్య తదితర ఖర్చుల కోసం మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేస్తుండగా, ఇదే అదనుగా కొందరు అధిక వడ్డీలు వసూలు చేస్తూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బంగారం, ఆస్తులను తనఖా పెట్టించుకోవడంతో పాటు వడ్డీ లెక్కల్లో మాయాజాలం చేస్తూ అప్పులు తీసుకున్నవారిని ఆర్థికంగా దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో కొందరు ఎలాంటి లైసెన్సులు లేకుండానే వడ్డీ వ్యాపారాలు సాగిస్తూ పేదలు, మధ్యతరగతి ప్రజలను పీడిస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నగరంలో పెద్ద మొత్తాల్లో ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు 150 నుంచి 200 మంది వరకు ఉంటారని అంచనా. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు ఉదయం రూ.వెయ్యి ఇచ్చి, సాయంత్రానికి రూ.100 నుంచి రూ.150 వరకు వడ్డీ కలిపి వసూలు చేసే వ్యాపారులు, వారి ఏజెంట్లు మరో 300 మంది వరకు ఉన్నట్లు సమాచారం. బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో సుమారు 250 మంది వడ్డీ వ్యాపారులు ఉన్నట్లు అంచనా. ముందస్తు కమీషన్ల కోత: పేదలు, చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారుల రోజువారీ అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు అప్పు ఇచ్చే ముందే 5 నుంచి 10 శాతం వరకు కమీషన్ మినహాయించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేతికి అందే మొత్తం తగ్గినా, తిరిగి చెల్లించాల్సిన అప్పుపై మాత్రం పూర్తి మొత్తానికి వడ్డీ వసూలు చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఆస్తులు, బంగారం తనఖా: పెద్ద మొత్తంలో అప్పులు కావాలంటే ఆస్తులు, బంగారాన్ని తనఖా పెట్టించుకుంటున్నారు. అధిక వడ్డీలు వసూలు చేయడంతో పాటు గడువు దాటితే చక్రవడ్డీ లెక్కలు వేసి భారాన్ని పెంచుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. అప్పులు చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు దౌర్జన్యంగా ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. కోట్లలో అక్రమార్జన: వడ్డీ వ్యాపారాల ద్వారా కొందరు కోట్ల రూపాయలు సంపాదిస్తూ స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డీ వేధింపులపై బాధితులు ప్రశ్నిస్తే ఆర్థిక, అంగబలంతో వారిని బెదిరించి నోరు మూయిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన

ప్రజానావ, వేములవాడ: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ విధులు, ఎఫ్ఐఆర్ నమోదు, ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు, షీ టీమ్స్, భరోసా కేంద్రాల పనితీరుపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో డయల్ 112 ద్వారా పోలీసుల సహాయం పొందే విధానాన్ని డెమో కాల్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు అడ్డంకులు తొలగించాలి

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు మేయర్ ఆదేశాలు



ప్రజానావ, పెద్దపల్లి: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు నగర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు. శుక్రవారం 49వ డివిజన్‌లోని శారదా నగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తరలించాలని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులకు సూచించారు. సుమారు రూ.6 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులను పరిశీలించి, 30 అడుగుల మేర రహదారిని విస్తరించి 20 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఇంటి ర్యాంపులను తగ్గించుకోవాలని స్థానికులకు సూచించారు. అనంతరం శారదా నగర్‌లో ప్రజాప్రతినిధులతో కలిసి శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు సాగి సంతోష్ రావు, గట్ల రమేష్, దేవిడ్ రాజు, ఏడీఈ గుండు శ్రీనివాస్, ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ నవీన్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, కృపాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యం ఏదీ?

- రోడ్లపైనే వాహనాలు.. ట్రాఫిక్ కష్టాలతో ప్రజల అవస్థలు
- ఆసుపత్రులు, మాల్స్, హోటళ్లలో నిబంధనలకు తూట్లు



ప్రజానావ, కరీంనగర్ : జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మున్సిపాలిటీల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలకు సరైన పార్కింగ్ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల సంఖ్యలో వినియోగదారులు కార్లు, ద్విచక్రవాహనాలపై వస్తున్నా కనీస సదుపాయాలు కల్పించడం లేదు. కొన్ని దుకాణాలు, ఆసుపత్రుల్లో సెల్లార్లు ఉన్నప్పటికీ వాటిని ఇతర వస్తువుల నిల్వకు వినియోగిస్తున్నారు. మరికొన్ని చోట్ల రహదారులపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. దీంతో రోడ్లు ఇరుకుగా మారి ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆసుపత్రుల నిర్వాహకుల ఇష్టారాజ్యం

కరీంనగర్‌లో 500కు పైగా వివిధ రకాల ఆసుపత్రులు ఉన్నట్లు అంచనా. నిబంధనల ప్రకారం పార్కింగ్ సౌకర్యం ఉండాల్సి ఉన్నప్పటికీ కొన్ని ఆసుపత్రుల నిర్వాహకులు వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అనుమతులు పొందే సమయంలో పార్కింగ్ సదుపాయం ఉన్నట్లు పేర్కొంటున్నా, ఆ తర్వాత వైద్యం కోసం వచ్చే రోగులు, వారి బంధువులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ఆసుపత్రుల్లో సెల్లార్ పార్కింగ్ ఉన్నప్పటికీ వాహనాలను అక్కడ నిలిపేందుకు అనుమతించడం లేదని ఆరోపణలున్నాయి. నర్సింగ్ హోంలు, రోగ నిర్ధారణ కేంద్రాలు, ఇతర ఆసుపత్రులకు వచ్చే వారు రోడ్లపైనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

హోటళ్లు, మాల్స్‌లోనూ ఇదే తీరు

నగరంలోని కొన్ని దుకాణాలు, మాల్స్, హోటళ్ల వద్ద కూడా పార్కింగ్ సదుపాయాలు లేక వాహనాలను రహదారులపైనే నిలుపుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడ వాహనాలు నిలిపిన ప్రజలు తిరిగి వచ్చే సరికి పోలీసుల జరిమానాలను ఎదుర్కొంటున్నారు. రద్దీ ప్రాంతంలోని నగరపాలక సంస్థ ఐడీఓసీఎంటీ భవనంలో పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో కొంతమేర ఉపశమనం లభిస్తోంది. అయితే వ్యాపార, వాణిజ్య సంస్థలు పార్కింగ్ నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మెటాకు జరిమానా

వినియోగదారుల సమాచార గోప్యతపై తప్పుదోవ పట్టించిందని ఆరోపణలు..

న్యూ మెక్సికో: వినియోగదారుల సమాచార గోప్యత విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించిందన్న కేసులో ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్‌ఫామ్స్‌పై అమెరికాలోని న్యూ మెక్సికో న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. సంస్థకు 25 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.2 లక్షల కోట్లు) జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఫ్రాన్సిస్ మాథ్యూ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో బ్రిటిష్ రాజకీయ సలహా సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికా సుమారు 8.7 కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని సేకరించిందనే ఆరోపణలు అప్పట్లో సంచలనం సృష్టించాయి. వినియోగదారుల సమాచారాన్ని ఎవరు పొందగలరనే అంశంపై వాస్తవాలను దాచిపెట్టి మెటా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపిస్తూ న్యూ మెక్సికో అటార్నీ జనరల్ దావా వేశారు. ఈ కేసును విచారించిన జ్యూరీ, డేటా గోప్యత, భద్రతపై సంస్థ చేసిన 29 బహిరంగ ప్రకటనల్లో 26 తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని నిర్ధారించినట్లు కథనాలు వెల్లడించాయి. రాష్ట్ర వినియోగదారుల పరిరక్షణ చట్టాల పరిధిలో మెటా 4.3 కోట్లకు పైగా ఉల్లంఘనలకు పాల్పడినట్లు జ్యూరీ తేల్చింది. రాష్ట్ర చట్టాల ప్రకారం సంస్థకు 219 బిలియన్ డాలర్లకు పైగా జరిమానా విధించే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయమూర్తి దానిని 25 బిలియన్ డాలర్లకు పరిమితం చేసినట్లు సమాచారం. దాదాపు 2 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన మెటాకు ఈ జరిమానా ఆర్థికంగా భారంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, సంస్థ ఈ తీర్పును సవాలు చేస్తూ సుదీర్ఘ అప్పీల్ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

బీజేపీతో పొత్తుకు అకాలీదళ్ సిద్ధం

ఎన్‌డీఏలో చేరే అవకాశాలున్నాయన్న సుఖ్‌బీర్ సింగ్ బాదల్



చండీగఢ్: పంజాబ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయని శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సంకేతాలిచ్చారు. తమ పార్టీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న పార్టీలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. దీంతో అకాలీదళ్ మళ్లీ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో చేరవచ్చనే చర్చకు బలం చేకూరింది. శుక్రవారం పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో భేటీ అనంతరం బాదల్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు తమ రాజకీయ ప్రత్యర్థులని స్పష్టం చేశారు. బీజేపీ పేరును నేరుగా ప్రస్తావించకపోయినా, సిద్ధాంతపరంగా దగ్గరగా ఉన్న పార్టీలతో కలిసి పనిచేస్తామన్న ఆయన వ్యాఖ్యలు పొత్తు అవకాశాలను సూచిస్తున్నాయి. గతంలో ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న అకాలీదళ్ 2020లో బీజేపీ నేతృత్వంలోని కూటమి నుంచి బయటకు వచ్చింది. అనంతరం 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఓటమి పాలైంది. కొంతకాలంగా ఎన్‌డీఏకు దగ్గరయ్యేందుకు బాదల్ ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఆగస్టులో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన భేటీ కావడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా కాంగ్రెస్, ఆప్‌లను ప్రధాన ప్రత్యర్థులుగా పేర్కొనడం, తమ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న పార్టీలతో పొత్తుకు సిద్ధమని చెప్పడంతో బీజేపీతో అకాలీదళ్ మళ్లీ చేతులు కలిపే అవకాశాలపై చర్చ మొదలైంది. అయితే, పొత్తుపై ఇరు పార్టీల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

సరిహద్దులను కాపాడండి ఢిల్లీని కాదు

- **కేంద్రంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శలు**
- **నిరసనలను అణచేందుకు సైన్యాన్ని వాడుతున్నారని ఆరోపణ**



న్యూఢిల్లీ: దేశ సరిహద్దులను కాపాడాల్సిన సైన్యాన్ని ప్రజల నిరసనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపయోగిస్తోందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. చైనా సరిహద్దుల్లో భారత జవాన్లతో చైనా సైన్యం ఘర్షణలకు దిగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యాలపై ప్రశ్నలు సంధించారు. సరిహద్దుల రక్షణకు వినియోగించాల్సిన సైన్యాన్ని దేశంలో నిరసనలను అడ్డుకోవడానికి ఉపయోగించడం వల్లే సరిహద్దుల్లో సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన ఆయన.. ప్రధాని మోదీ ప్రభుత్వం సొంత ప్రజలను అణచివేసేందుకు దేశ భద్రతను పణంగా పెడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం రక్షించాల్సింది ఢిల్లీని కాదని, దేశ సరిహద్దులని వ్యాఖ్యానించారు. శాంతియుత నిరసనలను అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్–చైనా సరిహద్దు వెంబడి తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని ఐటీబీపీ చీఫ్ శత్రుజీత్ కపూర్ ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు. భారత సైన్యం, సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ) సిబ్బందికి సవాళ్లు ఎదురవుతున్నాయని కపూర్ పేర్కొన్నారు. సరిహద్దుల రక్షణ కోసం కేంద్రం కొత్తగా ఏర్పాటు చేసిన శౌర్య కమాండోలు ధైర్యంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరిణామాలపై స్పందించిన దీప్కే.. సైన్యాన్ని వినియోగించడంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యాలు ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు చైనా సరిహద్దుల్లో ఘర్షణల అంశంపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ) కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఇది ప్రభుత్వ వైఫల్యమని ఆరోపిస్తున్నాయి.


టిబెట్‌లో భారీ భూకంపం

- **16 మంది మృతి • 46 మందికి గాయాలు**
- **339 ఇళ్లు నేలమట్టం**
- **కొనసాగుతున్న సహాయక చర్యలు**

ప్రజానావ, బీజింగ్: చైనాలోని టిబెట్ ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.0 తీవ్రతతో భూమి కంపించడంతో 16 మంది మృతిచెందగా, మరో 46 మంది గాయపడ్డారు. సుమారు 339 ఇళ్లు నేలమట్టమైనట్లు సమాచారం. నాగ్చు ప్రాంతంలో స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10.33 గంటలకు భూకంపం సంభవించగా, భూమికి సుమారు 18 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రాజధాని లాసాకు ఈశాన్య దిశలో ఉన్న ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలిస్తున్నారు. పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతినడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సముద్ర మట్టానికి సుమారు 4,800 మీటర్ల ఎత్తులో ఉన్న గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 1,600 మంది స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. బాధితుల కోసం 100 తాత్కాలిక గృహ నిర్మాణ యూనిట్లు, 3,000 గుడారాలతో పాటు చేతి దీపాలు, చలిని తట్టుకునే దుస్తులను తరలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఆ ప్రాంతం మీదుగా వెళ్లే రైళ్లను నిలిపివేయగా, జాతీయ రహదారి 317పై రాకపోకలను పాక్షికంగా నిలిపివేశారు. రాబోయే రోజుల్లో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు హెచ్చరించారు. టిబెట్ చైనా ఆధీనంలో ఉండటంతో అక్కడి నుంచి వెలువడుతున్న సమాచారంపై చైనా నియంత్రణ కొనసాగుతోందన్న చర్చ కూడా ఉంది.

షామోండా వైరస్‌తో మనిషి మృతి

- **ఫ్రాన్స్‌లో తొలి కేసు**
- **పశువుల నుంచి మనుషులకు వ్యాప్తిపై ఆందోళన**



పారిస్: సాధారణంగా పశువుల్లో కనిపించే షామోండా వైరస్ మనిషికి సోకి ఓ వ్యక్తి మరణించిన ఘటన ఫ్రాన్స్‌లో వెలుగుచూసింది. యూరప్‌లో మనిషికి ఈ వైరస్ సోకిన తొలి ఘటనగా భావిస్తున్న ఈ పరిణామం వైద్య వర్గాల్లో చర్చనీయాంశమైంది. నైజీరియాలో తొలిసారిగా గుర్తించిన ఈ వైరస్ దశాబ్దాల తర్వాత యూరప్‌లోనూ కనిపించినట్లు నిపుణులు చెబుతున్నారు. దోమలు వంటి కీటకాలు కుట్టడం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. ప్రధానంగా పశువులు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, అల్పాకా జంతువులకు ఇది సోకుతుంది. ష్మాలెన్‌బర్గ్ వైరస్‌కు దగ్గరి సంబంధమున్న ఈ వైరస్ జంతువుల పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. 1965లో నైజీరియాలో తొలిసారిగా గుర్తించిన ఈ వైరస్ ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాల్లోనూ కనిపించింది. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఐర్లాండ్ దేశాల్లో పశువుల పెంపకందారుల వద్ద ఉన్న జంతువుల్లో వైరస్ ఆనవాళ్లను గుర్తించారు. వసంతకాలం నుంచే వైరస్ వ్యాప్తి చెందుతున్నట్లు ఫ్రాన్స్ అధికారులు పేర్కొన్నారు. షామోండా వైరస్ సోకిన జంతువుల్లో జ్వరం, విరేచనాలు, పాల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. గర్భస్రావాలు, పిండం ఎదుగుదలలో లోపాలు తలెత్తే అవకాశముంది. గుర్రాల్లో నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యలు కూడా గుర్తించారు. ఈ వైరస్‌ను తొలిసారిగా 1965లో నైజీరియాలో పశువుల్లో గుర్తించారు. ప్రస్తుతం వైరస్ సోకిన మనిషికి సంబంధించిన వివరాల ప్రకారం, బాధితుడు తీవ్ర అనారోగ్యంతో పాటు రోగనిరోధక శక్తి బాగా తగ్గిన స్థితిలో ఉన్నారు. ఆయనలో మెదడుకు సంబంధించిన సమస్యలు కనిపించడంతో వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో వైరస్ ఆనవాళ్లు బయటపడ్డాయి. అయితే, వైరస్ సోకడమే మరణానికి కారణమని నిర్ధారించేందుకు మరిన్ని పరిశోధనలు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఈ వైరస్ మనుషుల మధ్య వ్యాపించినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవని, సాధారణ ప్రజలకు ప్రస్తుతం ఆరోగ్య ముప్పు ఉన్నట్లు గుర్తించలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. వైరస్ సోకిన కీటకం కాటు ద్వారా బాధితుడికి ఇన్‌ఫెక్షన్ వచ్చి ఉండవచ్చని ఫ్రాన్స్ అధికారులు భావిస్తున్నప్పటికీ, దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం షామోండా వైరస్‌కు ప్రత్యేక చికిత్సలు, టీకాలు అందుబాటులో లేవు.



బాణసంచా కర్మాగారంలో భారీ పేలుళ్లు

- **నలుగురు మృతి**
- **రెండు గంటలపాటు వరుస పేలుళ్లు**
- **కూలిన భవనం ముందు భాగం**

పాట్నా: బీహార్‌లోని సివాన్ జిల్లాలో బాణసంచా నిల్వ ఉంచిన భవనంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు బాణసంచాకు వ్యాపించడంతో వరుస పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. మహమ్మద్ అమీరుద్దీన్ మియాన్‌కు చెందిన బాణసంచా తయారీ కేంద్రానికి సంబంధించిన నిల్వ భవనంలో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో భవనంలో పలువురు కార్మికులు ఉన్నట్లు సమాచారం. దీంతో మరింత ప్రాణనష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. పేలుళ్ల తీవ్రతకు భవనం ముందు భాగం కూలిపోవడంతో శిథిలాలు రోడ్డుపై పడ్డాయి. సుమారు రెండు గంటలపాటు పేలుళ్లు కొనసాగడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పేలుళ్ల ధాటికి కొన్ని మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు, సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు, పూర్తిస్థాయి ప్రాణనష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

స్టార్‌లింక్ సేవల్లో మళ్లీ అంతరాయాలు

- **డ్రోన్ల అనుసంధానంలో సమస్యలు**
- **సైనిక కార్యకలాపాలకు ఆటంకం**



కీవ్: స్టార్‌లింక్ ఉపగ్రహ నెట్‌వర్క్ సేవల్లో ఇంకా అంతరాయాలు ఎదురవుతున్నాయని ఉక్రెయిన్ వెల్లడించింది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణ శాఖ వర్గాలు కూడా ధ్రువీకరించినట్లు సమాచారం. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ సేవలపై ఆంక్షలు తొలగించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ, ఉక్రెయిన్‌లో మాత్రం సమస్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గంటకు సుమారు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే డ్రోన్లకు ఉపగ్రహ అనుసంధానం తెగిపోతోందని అధికారులు చెబుతున్నారు. దీంతో సైనిక కార్యకలాపాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ సైన్యానికి స్టార్‌లింక్ ఉపగ్రహ నెట్‌వర్క్ కీలకంగా మారింది. సైనిక అవసరాల కోసం ఉపయోగించే స్టార్‌షీల్డ్ సేవలను ఉక్రెయిన్‌కు నిలిపివేయాలని మస్క్‌కు తాను ఆదేశాలు ఇవ్వలేదని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. స్టార్‌షీల్డ్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చినట్లు మస్క్ కూడా వెల్లడించారు. అయితే, స్టార్‌లింక్, స్టార్‌షీల్డ్ నెట్‌వర్క్‌ల పనితీరు మందగించడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉపగ్రహ అనుసంధాన వేగం తగ్గడంతో దాడి డ్రోన్లను సమర్థంగా వినియోగించడంలో, రక్షణ కార్యకలాపాలను సమన్వయం చేయడంలో ఉక్రెయిన్ సైన్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. రెండు నెట్‌వర్క్‌ల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఉక్రెయిన్ రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. ఉపగ్రహ సేవలపై విధించిన ఆంక్షలను అమెరికా ఎత్తివేసినట్లు తమకు అధికారిక సమాచారం అందలేదని పేర్కొన్నాయి. తక్కువ భూ కక్ష్యలోని ఉపగ్రహాలకు అనుసంధాన వేగాన్ని తగ్గించడంతో డ్రోన్ల పనితీరుపై ప్రభావం పడుతోందని కీవ్ గతంలో ఆరోపించింది. గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో ప్రయాణించే డ్రోన్లకు అనుసంధానం తెగిపోతున్నట్లు అధికారులు గుర్తించారని సమాచారం. ఉక్రెయిన్ సైన్యం స్టార్‌షీల్డ్ సేవలను వినియోగిస్తున్నప్పటికీ, ఆ ఉపగ్రహ వ్యవస్థ అమెరికా సైనిక నియంత్రణలో ఉండటంతో ప్రస్తుత అంతరాయాల వెనుక పెంటగాన్ పాత్ర ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఉక్రెయిన్ ఉపగ్రహ నెట్‌వర్క్‌లపై ఆంక్షలు విధిస్తున్నారనే వార్తలను అమెరికా శ్వేతసౌధం ఖండించింది.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: తమను అరెస్టు చేసినా సీజేపీ చేపట్టిన ఉద్యమం ఆగబోదని ఆ పార్టీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ స్పష్టం చేశారు. తాము లేదా పార్టీకి చెందిన ఇతర నేతలు జైలులో ఉన్నా, బయట ఉన్నా ఉద్యమం కొనసాగుతుందని వెల్లడించారు. శుక్రవారం ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరైన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 13న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలపై పోలీసులు గతంలో రాంకా, దాస్‌లను అరెస్టు చేశారు. కోర్టు వారికి న్యాయ నిర్బంధం విధించడంతో వారం రోజులకు పైగా తిహార్ జైలులో ఉన్నారు. అనంతరం బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేయగా, అదే రోజు మరో కేసులో విచారణకు హాజరు కావాలని ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఇద్దరికీ సమన్లు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వారు విచారణకు హాజరయ్యారు. నేతలను అరెస్టు చేస్తే ఉద్యమాన్ని ఎలా కొనసాగిస్తారని మీడియా ప్రశ్నించగా.. అరెస్టుల వల్ల తమ గురించి ప్రజలు మరింతగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని, వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకునే వీలుంటుందని వారు వ్యాఖ్యానించారు. తాము నాయకులం కాదని, దేశ ప్రజలు తమకు అప్పగించిన వ్యవస్థకు సంరక్షకులమని పేర్కొన్నారు. తమ వల్ల సాధ్యమైనంత మేలు చేయడమే లక్ష్యమని, అరెస్టులు ఉద్యమాన్ని నిలువరించలేవని స్పష్టం చేశారు.

జోర్డాన్ చర్చిలో కాల్పులు.. ఏడుగురు మృతి

- **అంత్యక్రియల సమయంలో దుండగుల దాడి**
- **మరో 10 మందికి గాయాలు**

అమ్మాన్: పశ్చిమాసియా దేశమైన జోర్డాన్‌లోని ఓ చర్చిలో జరిగిన కాల్పుల ఘటనలో ఏడుగురు మృతిచెందగా, మరో 10 మంది గాయపడ్డారు. రాజధాని అమ్మాన్‌కు దక్షిణంగా సుమారు 90 మైళ్ల దూరంలోని కరాక్ ప్రావిన్స్‌లో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కరాక్ గవర్నరేట్ పరిధిలోని హామాడ్ చర్చిలో అంత్యక్రియలు జరుగుతుండగా వాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు తుపాకులతో విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు స్థానిక ప్రజా భద్రతా విభాగం వెల్లడించింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించగా, గాయపడిన 10 మందిని అధికారులు సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. దుండగులు ఏకే–47 కలాష్నికోవ్ రైఫిల్‌తో కొన్ని నిమిషాలపాటు కాల్పులకు తెగబడ్డారు. సమాచారం అందుకున్న భద్రతా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కాల్పులకు పాల్పడినవారు ఎవరు, దాడికి గల కారణాలేమిటన్నది ఇంకా వెల్లడికాలేదు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని జోర్డాన్ ప్రభుత్వ ప్రతినిధి మొహమ్మద్ అల్ మొమానీ తెలిపారు.



ఇంజినీరింగ్ చదవకుండానే ఎగిరే కారు తయారు

- **13 ఏళ్ల స్వీయ అభ్యాసంతో ఆవిష్కరణ**
- **కొండ ప్రాంతాల్లో అత్యవసర సేవలే లక్ష్యం**

డెహ్రాడూన్: ఇంజినీరింగ్ డిగ్రీ లేకపోయినా తన కలను సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించిన ఉత్తరాఖండ్ యువకుడు రవి తమ్టా ఎలక్ట్రిక్ ఎగిరే కారు నమూనాను రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అల్మోరా జిల్లా జాగేశ్వర్ ధామ్ సమీపంలోని కాఫ్లిఖాన్‌కు చెందిన రవి, గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక విద్యను అభ్యసించిన అనంతరం నైనిటాల్ క్యాంపస్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పట్టా పొందాడు. అతడి తండ్రి హరీష్ రామ్ వృత్తిరీత్యా మెకానిక్. కొండ ప్రాంతాల్లో ప్రయాణానికి ఎదురయ్యే ఇబ్బందులు, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేరుకోవడానికి పడే కష్టాలు రవిని ఆలోచింపజేశాయి. దీంతో 2015లో ఎగిరే కారును తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇంజినీరింగ్ చదవకపోయినా 13 ఏళ్లపాటు అంతర్జాలం ద్వారా సాంకేతిక అంశాలను స్వయంగా నేర్చుకుంటూ ప్రయోగాలు చేశాడు. ఇందుకోసం హపిడా స్కై ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసి, 'హపిడా స్కైనెక్స్' పేరుతో ఒకే వ్యక్తి ప్రయాణించగల ఎలక్ట్రిక్ ఎగిరే కారు నమూనాను అభివృద్ధి చేశాడు. బహుళ రోటర్లతో పనిచేసే డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి, విద్యుత్ మోటార్లు, ప్రొపెల్లర్లు, తేలికపాటి చట్రం, చిన్న ప్రయాణికుల గదితో దీనిని రూపొందించాడు. బ్యాటరీతో పనిచేసే ఈ వాహనం రన్‌వే అవసరం లేకుండా నిలువుగా పైకి ఎగరడం, కిందికి దిగడం వంటి లక్షణాలతో రూపొందించబడింది. ఈ ఏడాది ఆగస్టులో తొలి ప్రయోగాత్మక పరీక్షను విజయవంతంగా పూర్తి చేసినట్లు సమాచారం. కొండ ప్రాంతాల్లో తక్కువ దూరాలకు ప్రయాణించడంతోపాటు మారుమూల ప్రాంతాల్లో వైద్య, ఇతర అత్యవసర సేవలకు దీన్ని ఉపయోగించాలన్నది రవి లక్ష్యం. అయితే పూర్తిస్థాయి వినియోగానికి పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) అనుమతులతో పాటు మరిన్ని పరీక్షలు, నియంత్రణ సంస్థల ఆమోదాలు అవసరం. ఎగిరే కారు నమూనాతోనే కాకుండా గతంలోనూ రవి పలు వినూత్న పరికరాలను రూపొందించాడు. మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసే బూట్లు, దృష్టిలోపం ఉన్నవారికి ఉపయోగపడే స్మార్ట్ కర్ర, వెదురును చీల్చే యంత్రం, అగ్నిమాపక పరికరాలు, అటవీ శాఖ అవసరాల కోసం కర్ర ఆకృతిలో మొబైల్ ఛార్జర్ వంటి వాటిని అభివృద్ధి చేశాడు. స్వయంగా నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో తన ఆలోచనలకు రూపమివ్వడం ద్వారా రవి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీతో పాటు పలువురు అతడి ఆవిష్కరణలను అభినందించారు.

వ్యక్తిగత ఏఐ సహాయక యాప్ 'క్లాడ్ డ్యూయెట్'

- **వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులకు ఉపయోగపడేలా రూపకల్పన**

వాషింగ్టన్: ఆంథ్రోపిక్ సంస్థ స్వతంత్ర కృత్రిమ మేధ సహాయక యాప్ 'క్లాడ్ డ్యూయెట్'ను ఆవిష్కరించింది. వృత్తి నిపుణులు, చిన్న వ్యాపారులకు చురుకైన సహాయకారిగా పనిచేసేలా దీన్ని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. రోజువారీ సమాచారాన్ని సంక్షిప్తంగా అందించడం, సమావేశాలను ఏర్పాటు చేయడం, ఆర్థిక అంచనాలు రూపొందించడం, వెబ్ అనువర్తనాలను నిర్వహించడం వంటి పలు పనులను ఈ యాప్ నిర్వహిస్తుందని పేర్కొంది.

హోటల్ గదిలో డీఎస్పీ మృతి

- **అనారోగ్యంతో మరణించినట్లు పోలీసుల అనుమానం**

గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కార్యాలయంలోని విజిలెన్స్ సెల్‌కు చెందిన డీఎస్పీ ఖర్గేశ్వర్ రాభా హోటల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. బోంగైగావ్‌లోని జాహ్నవి రీజెన్సీ హోటల్‌లో బస చేసిన ఆయన చాలాసేపటి వరకు గది నుంచి బయటకు రాకపోవడంతోపాటు, గది నుంచి దుర్వాసన రావడాన్ని గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న సీనియర్ పోలీసు అధికారులు గది తలుపులను బలవంతంగా తెరిచి చూడగా, కుళ్లిన స్థితిలో ఉన్న రాభా మృత దేహం కనిపించింది. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అనారోగ్య కారణాలతోనే ఆయన మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్న ప్పటికీ, మృతికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆయన హోటల్‌లో బస చేసిన పరిస్థితులు, సందర్శకుల వివరాలు, ఫోన్ కాల్స్ సమాచారం, సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాలు అందిన తర్వాతే మరణానికి అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసు అధికారులు తెలిపారు.



చరిత్ర సృష్టించిన భారత అథ్లెట్లు

- పారా ఆసియా క్రీడల్లో 114 పతకాలతో సరికొత్త రికార్డ్

నగోయా: పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 114 పతకాలు సాధించి, పారా ఆసియా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశారు. ఇందులో 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలు ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. 2022లో చైనాలో జరిగిన క్రీడలతో పోలిస్తే ఈసారి ఆరు పతకాలు అదనంగా సాధించింది. 97 పతకాలతో రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఐదో స్థానంలో ఉంది. చివరి రోజు పోటీలు ముగిసే సమయానికి ఆ దేశం మరిన్ని పతకాలు సాధిస్తే భారత్ స్థానం మారే అవకాశం ఉంది. చైనా 427 పతకాలతో అగ్రస్థానంలో ఉండగా, జపాన్ 185, ఉజ్బెకిస్థాన్ 145 పతకాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. చివరి రోజు భారత పారా షూటర్ మోనా అగర్వాల్ 50 మీటర్ల రైఫిల్ విభాగంలో స్వర్ణం సాధించింది. చైనాకు చెందిన క్యూపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల ఆధిక్యంతో విజయం సాధించింది.

ప్రపంచ రికార్డులతో సందీప్, హనీ

పురుషుల టీ64 విభాగంలో 400 మీటర్ల పరుగును సందీప్ 52.28 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలిచాడు. ఇదే పోటీలో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రోలో భారత అథ్లెట్ హనీ ఎఫ్37 విభాగంలో ప్రపంచ రికార్డును రెండుసార్లు అధిగమించాడు. ఐదో ప్రయత్నంలో 59.72 మీటర్లు విసిరి రికార్డు నెలకొల్పిన అతడు, చివరి ప్రయత్నంలో 60.49 మీటర్ల దూరం విసిరి తన రికార్డును తానే బద్దలు కొట్టి స్వర్ణం సాధించాడు.

బౌలర్లకు పరీక్షే!

- గత మ్యాచ్‌లో తేలిపోయిన టీమిండియా బౌలర్లు
- నేడు కివీస్‌తో రెండో టీ20
- ఇషాన్ కిషన్‌కు గాయం.. జట్టులోకి వైభవ్



క్రైస్ట్‌చర్చ్: తొలి టీ20లో బ్యాటర్లు అదరగొట్టి జట్టును గెలిపించినా.. భారత బౌలింగ్ విభాగం మాత్రం ఇంకా గాడిన పడలేదు. శనివారం న్యూజిలాండ్‌తో జరిగే రెండో టీ20లో బౌలర్లు తమ లయను అందుకోవడంతో పాటు, విధ్వంసకర బ్యాటింగ్‌కు పేరుపొందిన కివీస్‌ను కట్టడి చేయాల్సి ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ.. తొలి పోరులో బౌలింగ్ లోపాలు స్పష్టంగా కనిపించాయి. హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో ఐదో, ఆరో బౌలింగ్ ప్రత్యామ్నాయాలపై ఆందోళన నెలకొంది. తొలి మ్యాచ్‌లో నితీశ్ రెడ్డి వికెట్ తీయకుండా నాలుగు ఓవర్లలో 40 పరుగులిచ్చాడు. నామన్ ధీర్‌కు బౌలింగ్ చేసే అవకాశం రాలేదు. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత భారత జట్టులోకి వచ్చిన భువనేశ్వర్ కుమార్ కూడా ధారాళంగా పరుగులిచ్చాడు. నాలుగు ఓవర్లలో 49 పరుగులు సమర్పించుకోవడంతో పాటు రెండు నోబాల్స్, రెండు వైడ్లు వేశాడు. అర్ష్‌దీప్ సింగ్ కూడా పవర్‌ప్లేలో ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్‌ల దూకుడును అడ్డుకోలేకపోయాడు. అక్షర్ పటేల్ కూడా తొలి మ్యాచ్‌లో అత్యధిక పరుగులిచ్చిన భారత బౌలర్‌గా నిలిచాడు. ఇక క్రైస్ట్‌చర్చ్‌లో మరోసారి బ్యాటింగ్‌కు అనుకూల పరిస్థితులు ఉండే అవకాశముంది. దీంతో బౌలర్లకు తప్పిదాలు చేసే అవకాశం తక్కువ. తొలి మ్యాచ్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ విజయం సాధించింది. అయితే బౌలర్లు సరైన లెంగ్త్‌లో బంతులు వేయలేకపోయారని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అంగీకరించాడు. కఠినమైన లెంగ్త్‌లపై దృష్టి పెట్టాల్సి ఉందన్నాడు. ఇదిలాఉంటే ఇషాన్ కిషన్ గాయంతో జట్టులో ఏర్పడిన ఖాళీతో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. అతడు అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించవచ్చని అంచనా. సంజూ శాంసన్ మూడో స్థానంలో, తిలక్ వర్మ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే అవకాశాలున్నాయి. తొలి మ్యాచ్‌లో శాంసన్, అభిషేక్ పవర్‌ప్లేలోనే 94 పరుగులు చేసి కివీస్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు.

స్పిన్నర్లపై గురి

న్యూజిలాండ్ పేసర్లు మాట్ హెన్రీ, ఆడమ్ మిల్నే తొలి స్పెల్‌లో స్వింగ్ రాబట్టినా.. శాంసన్, అభిషేక్‌లను నిలువరించలేకపోయారు. మరోవైపు కెప్టెన్ మిచెల్ సాంట్నర్, మైఖేల్ బ్రేస్‌వెల్ మధ్య ఓవర్లలో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ముఖ్యంగా ఆఫ్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో భారత ఎడమచేతి వాటం బ్యాటర్లు తడబడుతున్నారు. ఈ బలహీనతను సద్వినియోగం చేసుకోవాలని కివీస్ భావిస్తోంది. భారత టాప్ ఆర్డర్‌ను నిలువరించడమే తమ ముందున్న ప్రధాన సవాలని సాంట్నర్ పేర్కొన్నాడు.

ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌కు సింధు

- క్వార్టర్స్‌లో చైనీస్ తైపీ క్రీడాకారిణిపై విజయం
- పోరాడి ఓడిన అశ్మిత చలిహా

పారిస్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన చియు పిన్‌చియాన్‌ను 21–13, 21–14తో వరుస గేముల్లో ఓడించింది. 39 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సింధు.. సెమీస్‌లో జపాన్‌కు చెందిన హినా అకేచితో తలపడనుంది. మరో భారత షట్లర్ అశ్మిత చలిహా పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. జపాన్ మాజీ ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ కాంస్య పతక విజేత నొజోమి ఒకుహారాతో జరిగిన మ్యాచ్‌లో అశ్మిత 10–21, 21–17, 16–21తో ఓటమి పాలైంది. ప్రీ క్వార్టర్స్‌లో మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ యమగుచిని ఓడించి సంచలనం సృష్టించిన ఆమె.. ఈసారి విజయం సాధించలేకపోయింది.

తొలి మ్యాచ్ నుంచి పాఠం నేర్చుకున్నా

మొదటి రౌండ్‌లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి సుపనిదా కతెథోంగ్‌పై తడబడిన సింధు.. ఈసారి ఆధిక్యంలో ఉన్నప్పటికీ చివరి వరకు అప్రమత్తంగా ఆడానని తెలిపింది. ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా పోరాడానని పేర్కొంది.



తొలి వన్డేలో జింబాబ్వేపై భారత్ విజయం

- ప్రతిక సెంచరీ.. షెఫాలీ అర్ధ సెంచరీ
- బౌలింగ్‌లో నాలుగు వికెట్లతో ఆకట్టుకున్న శ్రీచరణి



వడోదర: భారత మహిళల జట్టు జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత శ్రీ చరణి (4/23), క్రాంతి గౌడ్ (3/42) బంతితో సత్తా చాటడంతో జింబాబ్వే 197 పరుగులకే పరిమితమైంది. అనంతరం ప్రతిక రావల్ (100 నాటౌట్) శతకంతో మెరవగా.. షెఫాలీ వర్మ (64 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 27.1 ఓవర్లలోనే 200/1 స్కోరుతో లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ ప్రతిక 15 ఫోర్లతో అజేయ శతకం సాధించింది. మరోవైపు షెఫాలీ కేవలం 33 బంతుల్లోనే నాలుగు సిక్సర్లు, ఐదు ఫోర్లతో 64 పరుగులు చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన 32 పరుగులు చేసింది. తొలి వికెట్‌కు మంధాన, ప్రతిక 94 పరుగులు జోడించి జట్టుకు శుభారంభం అందించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 49.3 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. శ్రీ చరణి నాలుగు వికెట్లు పడగొట్టగా, క్రాంతి గౌడ్ మూడు వికెట్లతో ప్రత్యర్థి పతనాన్ని శాసించింది. జింబాబ్వే బ్యాటర్లలో బెలట్జ్ బిజా 62 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది.





కోటిపైనే దరఖాస్తులు!

- చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిన జియో ఐపీఓ
- రూ.7.4 లక్షల కోట్ల డిమాండ్.. 22.19 రెట్లు సబ్‌స్క్రిప్షన్
- సంస్థాగత మదుపర్ల నుంచి భారీ స్పందన
- రూ.30,213 కోట్ల సమీకరణకు రిలయన్స్ అనుబంధ సంస్థ సన్నాహాలు



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు మదుపర్ల నుంచి అపూర్వ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఐపీఓ 22.19 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. మొత్తం దరఖాస్తుల సంఖ్య 1.39 కోట్లకు చేరి దేశీయ ఐపీఓల చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. పబ్లిక్ ఇష్యూ, యాంకర్ మదుపర్ల బిడ్ల విలువ కలిపి రూ.7.4 లక్షల కోట్లను దాటింది. స్టాక్ ఎక్స్ఛేంజీల గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లోని 19.75 కోట్ల షేర్లకు గాను 438.3 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. యాంకర్ పెట్టుబడులను మినహాయించినా పబ్లిక్ ఇష్యూలో రూ.4.9 లక్షల కోట్లకు పైగా విలువైన బిడ్లు వచ్చాయి. అర్హత కలిగిన సంస్థాగత మదుపర్ల విభాగం 70.55 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో కేటాయించిన 4.9 కోట్ల షేర్లకు 345.8 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. సంస్థాగతేతర మదుపర్ల విభాగం 14 రెట్లు, వాటాదారుల విభాగం 7.60 రెట్లు, ఉద్యోగుల విభాగం 2.93 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రిటైల్ మదుపర్లు తమకు కేటాయించిన షేర్ల కంటే 2.72 రెట్లు అధికంగా బిడ్లు వేశారు. గతంలో వారీ ఎనర్జీస్ ఐపీఓ పేరిట నమోదైన 97.34 లక్షల దరఖాస్తుల రికార్డును జియో అధిగమించింది.

రూ.30,213 కోట్ల సమీకరణ

ఈ ఐపీఓలో భాగంగా జియో ప్లాట్‌ఫామ్స్ 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేస్తోంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,065–1,119గా నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.30,213 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ధర వద్ద కంపెనీ విలువ సుమారు 108 బిలియన్ డాలర్లకు చేరనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లేదా ఇతర ప్రస్తుత వాటాదారులు తమ షేర్లను విక్రయించడం లేదు. సమీకరించే నిధుల్లో గరిష్ఠంగా రూ.27,500 కోట్లను అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రుణాల చెల్లింపునకు వినియోగించనుంది. మిగిలిన మొత్తాన్ని సాంకేతికత, డిజిటల్ సేవల విస్తరణ, మూలధన వ్యయం, నిర్వహణ అవసరాలకు కేటాయించనుంది. టెలికాం సేవలకు మించి వ్యాపారాన్ని విస్తరించేందుకు కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలపై దృష్టి సారిస్తున్నట్లు జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు. 53.33 కోట్ల మంది వినియోగదారుల బలంతో సాంకేతిక, వ్యాపార సేవలను విస్తరించాలని సంస్థ భావిస్తోంది.

ఖాతాదారుల సొమ్ముకు ముప్పులేదు

- సైబర్ భద్రతపై సమగ్ర దర్యాప్తు: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ఖాతాదారుల సొమ్ముకు ఎలాంటి ముప్పు లేదని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) భరోసా ఇచ్చింది. 3,897 మంది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు డార్క్ వెబ్‌లో బహిర్గతమైనట్లు అనుమానాలు రావడంతో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా విశ్లేషించగా ఈ విషయం గుర్తించినట్లు తెలిపింది. బహిర్గతమైన వివరాల్లో పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీలు, ఈ–మెయిల్ చిరునామాలు, నివాస వివరాలు ఉన్నట్లు పేర్కొంది. ఈ నెల 16న సైబర్ ముప్పుల సమాచార సంస్థలు, రక్షణ సైబర్ ఏజెన్సీ, సెర్ట్–ఇన్ నుంచి హెచ్చరికలు అందడంతో విచారణ ప్రారంభించినట్లు బ్యాంకు తెలిపింది. ప్రభావిత ఖాతాదారులకు ఈ–మెయిల్, వాట్సాప్ ద్వారా ఇప్పటికే సమాచారం అందించామని, ఘటనపై సమగ్ర దర్యాప్తునకు సెర్ట్–ఇన్ గుర్తింపు పొందిన స్వతంత్ర సైబర్ భద్రతా సంస్థను నియమించామని వెల్లడించింది. ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, ఈ–మెయిళ్లపై జాగ్రత్త వహించాలని సూచించింది. ఓటీపీలు, పిన్‌లు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించింది. బహిర్గతమైన సమాచారం ప్రామాణికత, మూలం, పరిధి, ముప్పులపై అంచనా కొనసాగుతోందని తెలిపింది. ఈ ఘటనతో బ్యాంకు ప్రధాన కార్యకలాపాలు, ఆర్థిక పనితీరు, సేవలకు గణనీయమైన అంతరాయం కలగలేదని, సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేసింది.

లాభాల్లో ఇన్ఫోసిస్

- రెండో త్రైమాసికంలో రూ.7,823 కోట్ల నికర లాభం



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.7,823 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంలోని రూ.7,364 కోట్లతో పోలిస్తే ఇది 6.2 శాతం అధికం. కార్యకలాపాల ఆదాయం 10.2 శాతం పెరిగి రూ.49,244 కోట్లకు చేరింది. కంపెనీ ఏఐ ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన 29 శాతం వృద్ధి చెందిందని సీఈవో, ఎండీ సలీల్ పరేఖ్ తెలిపారు. సమీక్షా త్రైమాసికంలో 5.2 బిలియన్ డాలర్ల విలువైన భారీ ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ఇందులో 2 బిలియన్ డాలర్లకు పైబడిన మెగా డీల్ ఉందని వెల్లడించారు. నిర్వహణ మార్జిన్ 21 శాతంగా నమోదైందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి అంచనాను 1–2 శాతంగా నిర్దేశించామని పేర్కొన్నారు. త్రైమాసికంలో 8,000 మంది కళాశాల విద్యార్థులను నియమించుకున్నామని, ఏడాది మొత్తంలో 20,000 మందిని తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కాగా, వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.26 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది. ఇది గతేడాదితో పోలిస్తే 13 శాతం అధికం.

లాభాల్లో టాటా మోటార్స్

- రెండో త్రైమాసికంలో రూ.1,254 కోట్ల నికర లాభం
- 36శాతం పెరిగి రూ.25,338 కోట్లకు చేరిన ఆదాయం



న్యూఢిల్లీ: టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.1,254 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంలో రూ.867 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించిన సంస్థ, ఈసారి బలమైన విక్రయాల వృద్ధితో లాభాల్లోకి వచ్చింది. కార్యకలాపాల ఆదాయం 36 శాతం పెరిగి రూ.25,338 కోట్లకు చేరింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం విక్రయాలు గతేడాది 94,681 యూనిట్ల నుంచి 1.35 లక్షల యూనిట్లకు పెరిగాయి. టోకు విక్రయాలు 42 శాతం వృద్ధి చెందాయి. దేశీయ విక్రయాలు 30.9 శాతం పెరిగి 1.14 లక్షల యూనిట్లకు చేరగా, అంతర్జాతీయ విక్రయాలు రెట్టింపునకు పైగా పెరిగి 21,132 యూనిట్లుగా నమోదయ్యాయి. వడ్డీ, పన్నులు, తరుగుదల, రుణ విమోచనకు ముందు ఆదాయం (ఈబీఐటీడీఏ) 31 శాతం పెరిగి సుమారు రూ.2,800 కోట్లకు చేరింది. అయితే నిర్వహణ మార్జిన్ 0.4 శాతం పాయింట్లు తగ్గి 10.9 శాతంగా నమోదైంది. ఉక్కు, రబ్బరు వంటి ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ వ్యయ నియంత్రణ, కార్యకలాపాల సామర్థ్యం ద్వారా మార్జిన్లను నిలబెట్టుకున్నామని కంపెనీ సీఎఫ్‌వో జి.వి. రమణన్ తెలిపారు. ఇటలీకి చెందిన ఐవెకో గ్రూప్ కొనుగోలు ప్రక్రియలో భాగంగా ఒక్కో షేరు ఆఫర్ ధరను 14.40 యూరోలకు పెంచామని, టెండర్ ఆఫర్ అక్టోబర్ 26 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ నెలాఖరులోగా లావాదేవీని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

నాలుగో రోజూ నష్టాల్లో దేశీయ మార్కెట్లు

- సెన్సెక్స్ 126 పాయింట్లు డౌన్.. 22,600 వద్ద ముగిసిన నిఫ్టీ



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 114 డాలర్లు దాటడం, విదేశీ సంస్థాగత మదుపరుల అమ్మకాలు, బలహీనమైన ప్రపంచ మార్కెట్ల సంకేతాలు ఇన్వెస్టర్ల సెంటిమెంటును దెబ్బతీశాయి. అన్ని రంగాల్లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 125.56 పాయింట్లు (0.17 శాతం) తగ్గి 73,123.83 వద్ద స్థిరపడింది. ఒక దశలో 797 పాయింట్లకు పైగా పతనమై 72,452.37 కనిష్ఠాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 87.65 పాయింట్లు (0.39 శాతం) నష్టపోయి 22,600 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 315 పాయింట్లకు పైగా పడిపోయింది. సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ మూడు శాతానికి పైగా నష్టపోయాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ తదితర షేర్లు లాభపడ్డాయి. బ్రెంట్ ముడిచమురు ధర 1.10 శాతం పెరిగి బ్యారెల్‌కు 114.42 డాలర్లకు చేరింది. గురువారం విదేశీ సంస్థాగత మదుపరులు రూ.3,458.70 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత మదుపరులు రూ.2,891.32 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ముడిచమురు ధరల పెరుగుదల, ప్రపంచ మార్కెట్ల బలహీనత, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో అమ్మకాలతో సమీప కాలంలో మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



తెలుగు ఇండస్ట్రీకి రావడం ఇంటికి వచ్చినట్లుంది

చాలా కాలం విరామం తర్వాత హీరోయిన్ శ్వేతా బసు ప్రసాద్ 'నా వైఫ్ మిస్సింగ్'తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'కొత్త బంగారు లోకం'తో హిట్ జోడీగా గుర్తింపు తెచ్చుకున్న వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ మరోసారి కలిసి నటించిన ఈ సిరీస్ ఆహా ఒరిజినల్‌గా తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతా బసు ప్రసాద్ మాట్లాడుతూ, 'నా వైఫ్ మిస్సింగ్' కథ విన్నప్పుడు స్వప్న పాత్రకు మంచి ప్రాధాన్యం ఉందని అనిపించిందని, ఈ సిరీస్ తనకు గొప్ప పునరాగమనంగా భావిస్తున్నానని తెలిపింది. ఇన్నేళ్ల విరామం తర్వాత వరుణ్‌తో కలిసి నటించడం ఎంతో సంతోషంగా ఉందని, అంకితభావంతో పనిచేసే దర్శకురాలు స్వాతితో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని చెప్పింది. ఈ అవకాశం కల్పించిన ఆహాకు కృతజ్ఞతలు తెలిపింది. వరుణ్ తన ఆత్మీయ మిత్రుడని పేర్కొన్న శ్వేతా.. తెలుగు చిత్ర పరిశ్రమలోకి తిరిగి రావడం సొంత ఇంటికి వచ్చిన అనుభూతిని కలిగిస్తోందని భావోద్వేగంగా చెప్పింది. ఈ సిరీస్‌ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నమ్ముతున్నట్లు వెల్లడించింది.



'ఈ నగరానికి ఏమైంది రిపీట్'లో మరో బ్యూటీ

కల్ట్ క్లాసిక్ హిట్ 'ఈ నగరానికి ఏమైంది'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్'పై యువతలో ఆసక్తి పెరుగుతోంది. తొలి భాగంలో అలరించిన మాస్ కా దాస్ విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను ఈ సీక్వెల్‌లోనూ సందడి చేయనుండగా, శ్రీనాథ్ మాగంటి స్థానంలో సుశాంత్ చేరారు. దర్శకుడు తరుణ్ భాస్కర్ తనదైన క్యాలీ డైలాగులు, సహజమైన హాస్యంతో ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే శివాత్మిక రాజశేఖర్‌ను కథానాయికగా పరిచయం చేసిన చిత్రబృందం తాజాగా మరో హీరోయిన్‌ను ప్రకటించింది. అనీషా ఆంబ్రోస్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు వెల్లడిస్తూ, శివాత్మిక, అనీషా స్టైలిష్‌గా కనిపిస్తున్న పోస్టర్‌తో పాటు 'ఈఎన్ఈ రిపీట్ అమ్మాయిలు.. కెమెరా ముందు స్క్రిప్ట్ లేకుండా' అంటూ ఓ క్యూట్ వీడియోను విడుదల చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి యువతను ఆకట్టు కుంటోంది. రూట్‌నోడ్ సినిమా పతాకంపై శృజన్ యెరబోలు నిర్మి స్తున్న ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీ తం అందిస్తున్నారు. ఇప్ప టికే చిత్రీక రణ పూర్తి చేసు కున్న ఈ సిని మా నవం బర్ 19న ప్రేక్ష కుల ముం దుకు రానుంది.

పురాణాలు.. మిస్టరీ.. ఏఐ టెక్నాలజీ



భారతీయ పురాణాలు, అంతుచిక్కని రహస్యాలు, భవిష్యత్తు సాంకేతికతను మేళవిస్తూ సరికొత్త సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు 'ఆర్విహా క్రియేషన్స్' సిద్ధమవుతోంది. ఈ నిర్మాణ సంస్థ తన తొలి చిత్రంగా రూపొందిస్తున్న 'ది ప్రొంప్ట్ వార్ – రైజ్ ఆఫ్ మహావీర్' టైటిల్‌ను 2026 దసరా పండుగ సందర్భంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత కథా ప్రపంచం, భారతీయ పురాణాల్లోని అంశాలు, భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. టైటిల్‌లోని 'రైజ్ ఆఫ్ మహావీర్' అనే ఉపశీర్షిక కథలోని ప్రధాన పాత్ర చుట్టూ అల్లుకున్న రహస్యాలపై ఉత్కంఠను పెంచుతోంది. విడుదల చేసిన పోస్టర్ ద్వారా చిత్ర బృందం సినిమా నేపథ్యంపై కొన్ని సంకేతాలను అందిస్తూ, కథ ఎలా ఉండబోతోందన్న ఆసక్తిని ప్రేక్షకుల్లో కలిగించింది. పురాణగాథల్లోని అద్భుతమైన అంశాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానిస్తూ సరికొత్త అనుభూతిని అందించాలన్న లక్ష్యంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కథనాలకు భిన్నంగా ఏఐ ఆధారిత ప్రపంచం, అంతుచిక్కని మిస్టరీలు, భవిష్యత్తు పరిణామాలు, పౌరాణిక నేపథ్యాన్ని కలిపి రూపొందిస్తున్న ఈ సినిమా ప్రేక్షకులను మరో కొత్త లోకంలోకి తీసుకెళ్లనుందని చిత్ర బృందం భావిస్తోంది.

నూతన దర్శకుడికి కీలక బాధ్యతలు

నిర్మాత నరేష్ గౌడ్ నేతృత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు ప్రసన్న కొత్వాల దర్శకత్వం వహిస్తున్నారు. వినూత్నమైన కథాంశంతో పాటు సరికొత్త ఆలోచనలను తెరపై ఆవిష్కరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. ఈ సినిమాతో జి.సి. శేఖర్ సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కథకు అనుగుణంగా సంగీతం, నేపథ్య స్వరాలను రూపొందిస్తూ ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించడంపై చిత్ర బృందం దృష్టి సారిస్తోంది. యువ ప్రతిభను ప్రోత్సహించడంతోపాటు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని భారీ స్థాయిలో చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఐదు భాషల్లో.. త్రీడీ రూపంలోనూ!

'ది ప్రొంప్ట్ వార్ – రైజ్ ఆఫ్ మహావీర్' చిత్రాన్ని 2027 వేసవిలో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత నరేష్ గౌడ్ వెల్లడించారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అంతేకాకుండా త్రీడీ రూపంలోనూ రూపొందిస్తుండటం మరో ప్రత్యేకతగా నిలవనుంది. కథలోని పౌరాణిక అంశాలు, భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానం, రహస్యభరితమైన సన్నివేశాలను త్రీడీ అనుభూతితో చూపించేందుకు చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తొలి చిత్రంతోనే విభిన్నమైన కథా ప్రపంచాన్ని పరిచయం చేయాలనే లక్ష్యంతో ఆర్విహా క్రియేషన్స్ ముందడుగు వేస్తోంది. టైటిల్ పోస్టర్‌తోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ చిత్రం, కథనం, సాంకేతికత, దృశ్య వైభవం పరంగా ఎలాంటి ప్రత్యేకతను చాటుకుంటుందో చూడాలి. పురాణాలు, మిస్టరీ, ఏఐ సాంకేతికత కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం భారతీయ సినీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందా అన్నది తెలియాలంటే విడుదల వరకు వేచి చూడాల్సిందే.

'జైలర్-2' నా జీవితంలో గోల్డెన్ ఛాన్స్

కొంతకాలం సినిమాలకు విరామం ఇచ్చిన నటి పూర్ణ.. సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్–2'తో గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచారు. రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలోని ఓ పాటలో పూర్ణ నృత్యంతో ఆకట్టుకోవడంతో ఆమెకు మంచి గుర్తింపు లభిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె భావోద్వేగభరితమైన పోస్టును పంచుకున్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి తెరను పంచుకోవాలని ప్రతి నటీనటుడూ కోరుకుంటారని, అయితే తనకు అలాంటి అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని పూర్ణ ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాను రజనీకాంత్‌కు వీరాభిమానినని, ఆయన నటించిన 'నరసింహ' చిత్రం తనకు ఎంతో ఇష్టమని గుర్తుచేసుకున్నారు. అలాంటి అభిమాన నటుడితో కలిసి 'జైలర్–2' వంటి భారీ పాన్ ఇండియా చిత్రంలో పనిచేయడం, అందులోనూ మంచి పాటలో నృత్యం చేసే అవకాశం దక్కడం తనకు ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణ, అద్భుతమైన స్పందన తనను భావోద్వేగానికి గురిచేస్తున్నాయని తెలిపారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రేక్షకులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మనం చేసే కష్టానికి, పనిపట్ల చూపించే అంకితభావానికి ఏదో ఒక రోజు తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని పెద్దలు చెబుతుంటారని, తన విషయంలో ఆ మాట 'జైలర్–2' రూపంలో నిజమైందని పూర్ణ భావోద్వేగంగా పేర్కొన్నారు. తనకు ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్, చిత్ర నిర్మాత సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్, ఉత్సాహభరితమైన సంగీతాన్ని అందించిన అనిరుధ్ రవిచందర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 'జైలర్–2'తో లభించిన ఈ గుర్తింపు తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన అనుభూతిగా నిలిచిపోతుందని పూర్ణ తన ఇటీవల పెట్టిన ఓ పోస్టులో పేర్కొన్నారు.

విభిన్న బృందంతో సూర్య దర్యాప్తు!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా యాక్షన్ డ్రామా 'సీన్'పై ఆసక్తి పెరుగుతోంది. 'ఆవేశం' ఫేమ్ జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్ర విశేషాలను తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. పోలీసు శాఖ నుంచి వైదొలిగిన ఓ మాజీ అధికారి పాత్రలో సూర్య కనిపించనున్నారు. పాత కేసును దర్యాప్తు చేసే బాధ్యత అతడికి అప్పగించడంతో, సహాయం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తనే ఓ బృందాన్ని ఏర్పాటు చేసుకుంటాడు. విభిన్న స్వభావాలు, అసాధారణ వ్యక్తులతో కూడిన ఆ బృందంతో కలిసి పనిచేయడం అతడికి సవాలుగా మారుతుంది. మరోవైపు క్రమశిక్షణ కలిగిన ప్రత్యర్థి బృందం ఉండటంతో దర్యాప్తు మరింత ఆసక్తికరంగా సాగుతుంది. ఈ క్రమంలో చోటుచేసుకునే పరిణామాలు, బృంద సభ్యుల మధ్య సంబంధాలు, హాస్యభరిత సన్నివేశాలతో కథ ప్రేక్షకులను అలరించనుందని దర్శకుడు తెలిపారు. కుటుంబ సమేతంగా ఆస్వాదించదగ్గ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. టూ డీ ఎంటర్ టైన్ మెంట్స్, జగరం స్టూడియోస్ సంయుక్తంగా నిర్మి స్తున్న ఈ చిత్రానికి సుశిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్నారు. నజ్రియా నజీమ్ కథానాయికగా నటిస్తుండగా, 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.



సూపర్

స్టార్ రజినీకాంత్ వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో దూసుకుపోతున్నారు. ఇటీవల 'జైలర్–2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన.. ఈ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద మంచి స్పందన అందుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనగా.. తాజా చిత్రంతో రజినీకాంత్ మరోసారి తనదైన శైలిలో అలరిస్తున్నారు. ఈ విజయోత్సాహంలో ఉన్న తలైవా.. త్వరలో 'ధర్మన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే ఆసక్తికరమైన అప్‌డేట్స్ బయటకు రావడంతో అంచనాలు పెరుగుతున్నాయి. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో రామ్ పోతినేని ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాశీ ఖన్నా, రుక్మిణి వసంత్, శ్రీలీల, సిమ్రాన్ వంటి కథానాయికలు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. తాజాగా ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. లేడీ

'ధర్మన్'లో సూపర్ స్టార్ రజినీకాంత్

సరసన నయనతార



సూపర్‌స్టార్ నయనతార కూడా 'ధర్మన్' చిత్ర బృందంలో చేరనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం చిత్రబృందం ఆమెను సంప్రదించగా.. నయనతార సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని, పలు కీలక సన్నివేశాల్లో ఆమె కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. రజినీకాంత్, నయనతార గతంలోనూ తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నేపథ్యంలో.. ఈ కాంబినేషన్ మరోసారి తెరపై కనిపిస్తే అభిమానులకు పండగే అని చెప్పవచ్చు. ఇప్పటికే రామ్ పోతినేని ప్రతినాయకుడిగా నటిస్తున్నారన్న వార్తతో ఆసక్తి పెరగగా.. నయనతార ఎంట్రీపై వస్తున్న ప్రచారం సినిమాపై మరింత హైప్ పెంచుతోంది. భారీ తారాగణం, యాక్షన్ ప్రధాన కథాంశం, అనిరుధ్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని అభిమానులు భావిస్తున్నారు.

త్వరలో పెళ్లి పీటలెక్కనున్న తేజ సజ్జా

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారనే వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తి రేపుతున్నాయి. అమెరికాలో స్థిరపడిన ఓ అమ్మాయితో ఆయన వివాహం జరగనుందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి తేజ సజ్జా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాం శంగా మారాయి. తనకు కాబోయే భార్యకు సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధం లేదని, ఆమె అమెరికాలో పెరిగిందని తెలిపినట్లు సమాచారం. గ్లామర్ ప్రపంచానికి, ప్రచారానికి దూరంగా ఉండే ఆమె వ్యక్తిత్వం తనకు నచ్చిందని, భవిష్యత్తులోనూ ఆమె వ్యక్తిగత జీవితాన్ని అలాగే గౌరవించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తమది సాంకేతిక రంగానికి చెందిన కుటుంబమని, ఆమె తన తండ్రితో కలిసి వ్యాపార వ్యవహారాలను చూసుకుంటుందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచడానికే ఇష్టపడే తేజ.. వివాహ వేడుకను కూడా కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో నిరాడంబరంగా నిర్వహించుకోవాలను కుంటున్నట్లు చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, నవంబర్‌లో నిశ్చితార్థం, డిసెంబర్‌లో రాజస్థాన్‌లో వివాహ వేడుక జరగనున్నాయని, అనంతరం హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వేడుకల తేదీలు, వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కెరీర్ విషయానికొస్తే.. ఇటీవల 'ది ట్రైటర్స్ తెలుగు' రియాలిటీ షోతో వ్యాఖ్యాతగా డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టిన తేజ సజ్జా.. ప్రస్తుతం 'జాంబీ రెడ్డి ఎన్ఎక్స్‌టీ ఎల్‌పీఎల్' సీక్వెల్‌లో నటిస్తున్నారు. సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర, శనయా కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.





ఆర్‌సీ17 కోసం చరణ్ కొత్త లుక్

మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఆర్‌సీ17పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా కోసం చరణ్ జుట్టు పెంచుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆయన పొనీటెయిల్‌తో కనిపించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. గతంలో సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'రంగస్థలం'లో సహజసిద్ధమైన రఫ్ లుక్‌తో ఆకట్టుకున్న చరణ్.. 'మగధీర'లో యోధుడిగా, 'ధృవ'లో స్టైలిష్ పోలీసు అధికారిగా, ఇటీవల 'పెద్ది'లో గడ్డం, పొడవాటి జుట్టుతో కనిపించి పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని మార్చుకోవడంలో ప్రత్యేకత చాటుకున్నారు. ఇప్పుడు ఆర్‌సీ17 కోసం సుకుమార్ ఎలాంటి లుక్‌ను సిద్ధం చేస్తున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా ప్రారంభోత్సవం త్వరలో జరగనున్నట్లు సమాచారం. ఇందులో సారా అర్జున్ కథానాయికగా నటించే అవకాశముందని, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. చరణ్ కొత్త లుక్‌పై వస్తున్న వార్తలతో ఆర్‌సీ17పై అభిమానుల్లో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.